# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :145 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: ఆదివారం 04-08-2024 | పేజీలు:4 వెల: 2.00


## 5 శాతం మేర పెరిగిన రెవెన్యూ రాబడులు

హైదరాబాద్, తెలంగాణ శాసనసభలో 2023 మార్చితో ముగిసిన ఏడాదికి రాష్ట్ర స్థితిగతులపై కాగ్ నివేదిక విడుదల చేసింది. రాష్ట్ర జీఎస్డీపీ 2021-22తో పోలిస్తే 2022-23లో 16 శాతం పెరిగిందని అందులో పేర్కొంది. రెవెన్యూ రాబడులు గణనీయంగా 25 శాతం మేర పెరిగాయి. రెవెన్యూ రాబడుల వృద్ధి రేటు ఒక శాతం తగ్గింది. సొంత పన్నుల రాబడి గణనీయంగా 17 శాతం పెరిగింది. సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.2,06,977 కోట్లకు పెరిగింది. 2023 మార్చి నాటికి పూర్తి కావాల్సిన 20 ప్రాజెక్టుల అంచనా వ్యయం పెరిగింది. రూ.2,749 కోట్ల మేర ద్రవ్యలోటు తక్కువ చేసి చూపించారు. 2022-23లో ప్రభుత్వం ఇచ్చిన రుణాలు, అడ్వాన్స్‌లు 150 శాతం మేర పెరిగాయి. సొంత రాబడి లేని సంస్థలకు ప్రభుత్వం రుణాలు ఏర్పాటు చేసింది. 2022-23 బ్జడెట్ వెలుపలి రుణాలు రూ.1,18,629 కోట్లుగా అంచనా. ఆయా రుణాలకు ప్రభుత్వం తదుపరి రుణాలుగా రూ.17,829 కోట్లు అందించింది. రాష్ట్రాభివృద్ధి రుణాలపై వడ్డీపై ఖర్చు తక్కువగా అంచనా వేస్తున్నారు.

# ప్రజల దీవెనలతో ఇందిరమ్మ రాజ్యం వచ్చింది



భూపాలపల్లి /గణపురం,ఉద్యోగాల వేటలో చాలా మంది ప్రజలు, నిరుద్యోగులు ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తుందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దనసరి అనసూయ సీతక్క, వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్యలు అన్నారు. శనివారం భూపాలపల్లి పర్యటనకు వచ్చిన మంత్రులు ముందుగా జయశంకర్ జిల్లా గణపురం మండలం గాంధీనగర్ మైలారం గుట్టపై 50 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు భూపాలపల్లి, వర్ధన్నపేట శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, కే ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరేతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభ లో మంత్రులు మాట్లాడారు.

ఇండస్ట్రియల్ పార్క్ తో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు.. మంత్రి సీతక్క

భూపాలపల్లికి ఇండస్ట్రియల్ పార్క్ రావడంతో భూపాలపల్లి యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని మంత్రులు ఆశాభావం వ్యక్తం చేశారు. ములుగులో కూడా ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఉద్యోగం కోసం తెలంగాణ ఉద్యమం అని చెప్పి గత బీ.ఆర్.ఎస్ పది సంవత్సరాలుగా ఒక్క నోటిఫికేన్ ఇవ్వలేదన్నారు. ధరణి తెచ్చి ఎందరినో ఇబ్బందులు పెట్టారని, సీఎం రేవంత్ రెడ్డి భూమాతను భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్నారన్నారు. జాబ్ క్యాలెండర్ తెచ్చామన్నారు స్కిల్ ఇండియా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రుణ మాఫీ జరిగిందన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఓకే సారి రెండు లక్షల రుణ మాఫీ చేశామన్నారు. భూపాలపల్లి అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని, వెనుక బడ్డ ప్రాంతాల అభివృద్దే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని మంత్రి సీతక్క తెలిపారు.

ప్రజల దీవెనలతో ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజల దీవెనలతో రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ లో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిఅన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు రెండు కళ్ల లాగ జోడెడ్ల లాగా సాగుతున్నాయన్నారు. పేదోడి ఆలోచనకు అనుగుణంగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కాబోతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను తూచా తప్పకుండా అమలుచేస్తూ ఇందిరమ్మ రాజ్యం చెప్పిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటకు ఇన్సురెన్స్,విత్తనాలకు సబ్సిడీ ఇస్తూ రైతులను రాజులు గా చేస్తుందన్నారు. శాసన సభ్యులు కోరిన విధంగా భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇస్తాం అన్నారు.ఈనెల చివరి వరకు 4.50 లక్షల ఇందిరమ్మ ఇల్లు యుద్ధ ప్రాతిపదికన ప్రతి గ్రామానికి ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూమ్ ఇస్తామని ఇదిగో అదిగో అని మాయ మాటలు చెప్పి 10 సంవత్సరాలలో కేవలం 1.50 లక్షల ఇల్లు మాత్రమే కట్టిందని గుర్తు చేశారు. కానీ ఈ ప్రభుత్వం మొదటి విడత లోన్ 4.50 లక్షల ఇళ్లు కట్టిస్తుందన్నారు. ప్రజల దీవెనలతో ఉన్న ఈ ప్రభుత్వంపై మీ ప్రేమాభిమానం ఉండాలన్నారు. శ్రీధర్ బాబు మంచి నిర్ణయం తీసుకొని ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధి చూపించారన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి వల్ల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ పేరు ఎత్తలేదు.. రాష్ట్రానికి న్యాయంగా రావాలసిన నిధుల గురించి బీజేపీ తొండాట ఆడుతుందన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా ఇందిరమ్మ రాజ్యంలో హామీలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు.

# మీ హామీని ఎలా నిలబెట్టుకుంటారో యువతకు చెప్పండి



హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. రాహుల్ గాంధీ జీ.. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న మీ మాటలు నమ్మి తెలంగాణ యువత కాంగ్రెస్‌కు ఓటేశారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలైనా ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలు సున్నా. ఎన్ని ఉద్యోగాలో చెప్పకుండా జాజ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. మరోసారి హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌కు వచ్చి యువతను కలిసి మీ హామీని ఎలా నిలబెట్టుకుంటారో చెప్పండి?.. అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్‌కు వచ్చి యువతతో మాట్లాడుతున్న వీడియోను షేర్ చేశారు.కాగా, శుక్రవారం రేవంత్ రెడ్డి సర్కార్ అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. పోస్టుల సంఖ్య లేకుండా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్‌పార్క్ వద్ద నిరసనకు దిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ‘తొమ్మిది నెలల కిందట ఉద్యోగాల పేరిట ఎంత డ్రామా చేసింద్రు..కేసీఆర్ అసలు ఉద్యోగాలే ఇవ్వలేదన్నట్టు తప్పుడు ప్రచారం చేసింద్రు. అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలని పత్రికల్లో ఊదరగొట్టే విధంగా అక్రమ సంపాదనతో కాంగ్రెస్ నాయకులు ప్రకటనలిచ్చింద్రు. రాహుల్ గాంధీని అడుగుతున్న, నువ్వు ప్రామిస్ చేసిన రెండు లక్షల ఉద్యోగాలేవీ?’ అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.క్యాలెండర్‌లో తేదీలు మారుతున్నాయని, మరి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఏవని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ వాళ్లు బయట కనబడితే నిరుద్యోగులు తన్నితరిమేసే పరిస్థితి ఉన్నదని దుయ్యబట్టారు. అందుకే నాలుగు కాగితాల మీద ఏది పడితే అది రాసుకొచ్చారని, అది జాబ్ క్యాలెండర్ అని ప్రకటించారని ఆక్షేపించారు. జాబ్ క్యాలెండర్ నిజమైతే అందులో రెండు లక్షలు కాదు రెండు ఉద్యోగాలు కూడా ఎందుకు పెట్టలేదని నిలదీశారు. దమ్ముంటే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి అశోక్‌నగర్‌కు రావాలని, తామంతా అక్కడికి వస్తామని కేటీఆర్ వారికి సవాల్ విసిరారు.

# ఊరంతా కొట్టుకుపోయి.. ఒక్క ఇల్లు మాత్రమే మిగిలింది



హిమాచల్: మెరుపు వరదలు హిమాచల్ ప్రదేశ్ (హిమాచల్ ప్రదేశ్)ను అతలాకుతలం చేశాయి. కులులోని నిర్మండ్ బ్లాక్, మలానా, మండి జిల్లాల్లో క్లౌడ్ బరస్ట్ (క్లౌడ్‌బర్స్ట్‌లు) కారణంగా బుధవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. దీంతో ఇండ్లు, పాఠశాలలతో పాటు ఆసుపత్రులు సైతం దెబ్బతిన్నాయి. ఈ వరద విలయానికి భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. దాదాపు 50 మందికిపైగా గల్లంతయ్యారు. పది మందిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ వరదలకు సమేజ్ గ్రామం (సామేజ్ గ్రామం) పూర్తిగా కొట్టుకుపోయింది (గ్రామం మొత్తం కొట్టుకుపోయింది). ఒక్క ఇల్లు మాత్రమే మిగిలింది.గ్రామం కొట్టుకుపోయిన తీరును అనితా దేవి (అనితా దేవి) అనే మహిళ కళ్లకు కట్టినట్లు వివరించారు. ‘బుధవారం రాత్రి మేం నిద్రిస్తున్నాం. ఆ సమయంలో భారీగా శబ్దం వినిపించింది. మా ఇల్లు ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. దీంతో మేం నిద్రలోంచి లేచి బయటకు వెళ్లి చూసేసరికి ఊరు మొత్తం కొట్టుకుపోయింది. భయంతో మేమంతా వెంటనే గ్రామంలోని భగవతి కాళీ మాత ఆలయం వద్దకు చేరుకున్నాం. రాత్రంతా అక్కడే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపాం. ఈ విధ్వంసంలో మా ఇల్లు మాత్రమే మిగిలింది. మిగిలినవన్నీ కళ్ల ముందే కొట్టుకుపోయాయి’ అంటూ భావోద్వేగంతో వివరించింది.మరో బాధితుడు బక్షి రామ్ మాట్లాడుతూ.. ‘నా కుటుంబ సభ్యులు దాదాపు 14 నుంచి 15 మంది వరదలో కొట్టుకుపోయారు. తెల్లవారుజామున 2 గంటలకు నాకు వరద వార్త అందింది. ఆ సమయంలో నేను ఊర్లో లేను. రాంపూర్‌లో ఉన్నాను కాబట్టి ప్రాణాలతో బయటపడ్డాను. తెల్లవారుజామున 4 గంటలకు ఇక్కడకు వచ్చాను. అప్పటి నుంచి గల్లంతైన నా కుటుంబ సభ్యుల కోసం వెతుకుతున్నాను. ఒక్కరైనా సజీవంగా ఉంటారని ఆశిస్తున్నాను’ అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.డిస్ట్రిక్ట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకారం.. కులు, మండి, సిమ్లా ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ కారణంగా వరదలు సంభవించాయి. ఈ వరదలకు సుమారు 53 మంది గల్లంతయ్యారు. ఇక ఇప్పటి వరకూ ఆరు మృతదేహాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వరదల కారణంగా 60కి పైగా ఇళ్లు కొట్టుకుపోయాయి. పలు గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయని డీడీఎంఏ ప్రత్యేక కార్యదర్శి డీసీ రమణ తెలిపారు.

# అబద్ధాల్లో రేవంత్ రెడ్డికి గిన్నిస్ రికార్డు ఇవ్వాలి..



హైదరాబాద్,అసెంబ్లీలో బీర్ఎస్ గొంతు నొక్కారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. జీరో అవర్ మొత్తం ఎత్తివేశారని, ప్రశ్నోత్తరాలు లేకుండా సూచిస్తున్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సభలో చర్చలకు అవకాశం ఇవ్వలేదని.. ప్రజా సమస్యలపై మాట్లాడదామంటే మైకులు కట్టేశారని.. ఇదేంటని అడిగితే మార్షల్స్‌తో బయటకు వెళ్లారని తెలిపారు.కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను తిట్టడానికే అసెంబ్లీని వినియోగించుకున్నారని వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. ఏడు నెలల్లోనే రేవంత్ రెడ్డి వికృతరూపం బయటపడిందని. రేవంత్ రెడ్డి ప్రజాపాలన కాదు.. నియంతృత్వ పాలన అని ఎద్దేవా చేశారు. ఇంత అధ్వాన్నంగా సభ ఎప్పుడూ జరగలేదని అక్బరుద్దీన్ కూడా అన్న పరిశీలన ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ మిత్రపక్షమని చెబుతున్న ఎంఐఎం కూడా కాంగ్రెస్ తీరును తప్పుబట్టిందని తెలిపారు. రేవంత్ సభా నాయకుడిగా కాకుండా ఆటవిక రాజులా వ్యవహరించారని అన్నారు. సీఎం ఇష్టారాజ్యంగా సభను తప్పుడు దోవ పట్టించారని. ఏ చర్చపై కూడా పూర్తిగా మాట్లాడలేదని అన్నారు. కేసీఆర్‌ను తిట్టాడు.. గత ప్రభుత్వంపై ఆరోపణలతోనే సభ నడించిందని అన్నారు.అసెంబ్లీని కౌరవ సభలా నడిపించారని వేముల ప్రశాంత్ రెడ్డి నిరుత్సాహపరిచారు. కళున్న కబోధి రేవంత్ రెడ్డి అని. హామీలను అమలు చేయడమే లక్ష్యంగా మాట్లాడామని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలు, 420 హామీల గురించి ఎక్కడా పేర్కొనలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలైనా వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు నెరవేర్చలేదని. అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అబద్ధాలు చెప్పారని అన్నారు.తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎక్కడైనా ఉద్యోగాలు భర్తీ చేస్తారా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగులను ఎంపిక చేస్తే.. ఈ ప్రభుత్వం ప్రకటించింది. ఒప్పందంలో వ్యవసాయ మోటార్లకు నిషేధం ఉందని అన్నారు. ఆ పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి తొక్కిపెట్టి తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వయనాడ్ సహాయకచర్యల్లో అద్భుతం...



వయనాడ్,ఆగస్ట్3: కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఓ వైపు మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అదే సమయంలో సహాయకచర్యల్లో సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తోంది. ఈ రక్రమంలో గిరిజన కుటుంబాన్ని కాపాడిన తీరు ఇప్పుడు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. విపత్తులో కొండ చరియలు విరిగిపడటంతో గ్రామాల ఆనవాళ్లు లేకుండా పోయాయి. వందల ఇళ్లు నేలమట్టమయ్యాయి. వందల మంది బురద మట్టిలో కూరుకుపోయారు. విపత్తు నిర్వహణ బృందాలు, సైనికులు నేటికీ సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. కాగా కల్పేట ఫారెస్ట్ ఆఫీసర్ కె.హాషిస్ నేతృత్వంలోని రెస్క్యూ బృందం తమ ప్రాణాలకు తెగించి ఓ గిరిజన కుటుంబాన్ని రక్షించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అధికారులు తెలిపిన వివరాల మేరకు... ఇంకా అక్కడక్కడ కొండ చరియలు విరిగిపడుతున్నా సహాయక బృందం సహాయక చర్యలు కొనసాగిస్తోంది. ఈ సమయంలో అటవీ ప్రాంతంలో ఉన్న లోయకు ఎదురుగా ఉన్న కొండపై ఓ గిరిజన కుటుంబం చిక్కుకొని ఉండడాన్ని బృందం గమనించింది. వారిని ఎలాగైనా కాపాడాలనే ఉద్దేశంతో నాలుగున్నర గంటల పాటు శ్రమించి తాళ్ల సహాయంతో కొండపైకి చేరుకున్నారు. అక్కడ పనియా తెగకు చెందిన ఓ గిరిజన కుటుంబం గుహలో చిక్కుకొని ఉండగా వారిని రక్షించారు. కాగా వారు కొద్దిరోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో నలుగురు చిన్నారులు, వారి తల్లిదండ్రులు నీరసించి పోయి ఉన్నారని రెస్క్యూ అధికారి తెలిపారు. దీంతో తమ వద్ద ఉన్న ఆహారాన్ని వారికి తినిపించామన్నారు. తమతో రావాల్సిందిగా వారిని కోరగా ఆ కుటుంబం నిరాకరించిందని, సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని ఎంతో బతిమాలగా వారి తండ్రి ఒప్పుకున్నారని తెలిపారు. పిల్లలు ఇద్దరినీ తమ శరీరాలకు కట్టుకొని తాళ్ల సహాయంతో గిరిజన కుటుంబాన్ని కొండపై నుంచి సురక్షితంగా కిందకు తీసుకువచ్చామని ఆయన వెల్లడించారు. అనంతరం వారిని అత్తమాల యాంటీ-పోచింగ్ కార్యాలయానికి తరలించినట్లుగా పేర్కొన్నారు. ప్రస్తుతం వారు అక్కడ సురక్షితంగా ఉన్నారన్నారు. వర్షాలు తీవ్రరూపం దాల్చడంతో అటవీశాఖ వాయనాడ్‌లోని అటవీ ప్రాంతాల్లో ఉన్న గిరిజన తెగలకు చెందిన చాలామందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. సహాయక చర్యలు ఇంకా కొనసాగు తున్నాయని అధికారులు వెల్లడించారు. రెస్క్యూ బృందం తమ ప్రాణాలకు తెగించి ఓ కుటుంబాన్ని కాపాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో కేరళ సీఎం పినరయి విజయన్ స్పందించారు. సహాయక బృందాన్ని కొనియాడారు. వయనాడ్‌లో నెలకొన్న బీభత్సంలో అటవీ అధికారులు, రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. రెస్క్యూ బృందం 8 గంటలపాటు శ్రమించి, ప్రాణాలకు తెగించి ఓ మారుమూల గిరిజన కుటుంబంలోని ఆరుగురి ప్రాణాలను కాపాడింది. ఈ విషాద సమయంలో సహాయక బృందాలు అందిస్తున్న తోడ్పాటు వారిలోని గొప్పతనాన్ని తెలియజేస్తోంది. మనం ఇలా ఐక్యంగా ఉంటూ ధైర్యంగా కష్టాలను ఎదుర్కొందాం.. పునర్నిర్మించుకుందాం అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పశ్చిమ కనుమలు సున్నితమే.. కేంద్ర ముసాయిదా

మరోవైపు, పశ్చిమ కనుమల 56,800 చతురస్రాకారంలో పర్యావరణ పరంగా చాలా సున్నితమైనదని నిదర్శనం కేంద్రం ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. వయనాడ్‌లో కొండచరియల విధ్వంసానికి గురైన 13 గ్రామాలు కూడా దీని పరిధిలో ఉన్నాయి. పర్యావరణ సున్నిత ప్రాంతాలకు సంబంధించి తాజాగా ఇచ్చిన నోటిఫికేషన్‌పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లోగా తెలియజేయాలని ప్రభుత్వం కోరింది. కేరళలో 9993.7 చదరపు సున్నిత ప్రాంతంగా కనిపిస్తుంది. హహారాష్ట్రలో 17,340, కర్ణాటకలో 20,668, తమిళనాడులో 6,914, గోవాలో 1,461, గుజరాత్‌లో 449 చదరపు ప్రాంతంలో దీని కిందకు వస్తుందని పేర్కొంది.

నది దిశ మార్చుకోవడంతోనే.. వయనాడ్‌లో అధిక నష్టం

వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ ఘటనకు సంబంధించి నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్ విశ్రాంత శాస్త్రవేత్త సోమన్ కీలక విషయాలు కనుగొన్నారు. ఈ విపత్తులో ఎక్కువగా నష్టం జరిగిన ముండక్కై, చూరల్‌మల ప్రాంతాలు నది ఒడ్డున ఉన్నాయని చెప్పారు. గతంలో ఇక్కడ కొండచరియలు విరిగి నదిలో పడి ఉండకుండా, అలా నదీ ప్రవాహం దిశ మారగా ఏర్పడిన ప్రాంతంపైనే

# అధ్యక్ష అభ్యర్థుల మధ్య చర్చ..కమలతో చర్చకు సిద్ధమన్న ట్రంప్



వాషింగ్టన్,ఆగస్ట్3,అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అధికార డెమోక్రటిక్ పార్టీ తరపున కమలా హారిస్ అభ్యర్థిత్వం ఖరారైంది. ఈ నేపథ్యంలో ఆమెతో ముఖాముఖి చర్చ జరిపేందుకు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమయ్యారు. ఈ మేరకు ఫాక్స్‌న్యూస్ ఆఫర్‌ను ఆయన అంగీకరించారు. ఈవిషయాన్ని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో తాజాగా వెల్లడించారు. వచ్చే నెలలో వీరి మధ్య డిబేట్ జరగనుంది. సెప్టెంబరు 4న ఫాక్స్ న్యూస్ నిర్వహించే ఈవెంట్‌లో కమలా హారిస్ తో డిబేట్ జరిపేందుకు అంగీకరించా. వాస్తవానికి ఇదే తేదీన ఏబీసీ ఛానల్‌లో జో బైడెన్‌తో నేను ముఖాముఖి చర్చలో పాల్గొనాల్సింది. అధ్యక్ష రేసు నుంచి ఆయన వైదొలగడంతో ఆ డిబేట్ రద్దయ్యింది. ఫాక్స్‌న్యూస్ డిబేట్ పెన్సిల్వేనియాలో జరుగుతుంది. బైడెన్‌తో జరిగిన చర్చలోని రూల్స్ అన్నీ దీనికి వర్తిస్తాయి. కానీ ఈసారి పూర్తిస్థాయిలో ప్రేక్షకులు కూడా ఉంటారని ట్రంప్ వెల్లడించారు. అయితే.. ఈ డిబేట్, దాని కండీషన్స్‌కు హారిస్ అంగీకరించారా? లేదా అన్నది మాత్రం ఇంకా తెలియరాలేదు. ట్రంప్‌తో చర్చ గురించి ఆమె ప్రతినిధులు ఇంకా స్పందించలేదు. అయితే, ఆయనతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధమేనని గతంలో కమలా హారిస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటికి ఆమె అభ్యర్థిత్వం ఖరారు కాకపోవడంతో ట్రంప్ దానిపై స్పందించలేదు. తాజాగా హారిస్ పోటీ ఖాయమవడంతో డిబేట్‌కు అంగీకరిస్తున్నట్లు మాజీ అధ్యక్షుడు పేర్కొన్నారు. కమలా హారిస్, ట్రంప్ మధ్య ముఖాముఖి చర్చ జరిగితే.. అది ఈ ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరగనున్న రెండో డిబేట్ కానుంది. జూన్‌లో బైడెన్, ట్రంప్ మధ్య తొలి డిబేట్ జరిగిన సంగతి తెలిసిందే. ఆ చర్చకు ప్రేక్షకులను అనుమతించలేదు. ఆ డిబేట్ తర్వాతే బైడెన్ అభ్యర్థిత్వంపై సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత మరింత తీవ్రమైంది. దీంతో అధ్యక్ష రేసు నుంచి ఆయన వైదొలిగి కమలా హారిస్ పేరును ప్రతిపాదించారు.

## వైకాపా అభ్యర్థిగా బొత్స పేరు ఖరారు

గుంటూరు, విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఖరారయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం ప్రకటించారు. తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా నేతలతో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. అభ్యర్థి ఎంపికపై నేతల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. పలువురి పేర్లు పరిశీలించి.. చర్చించిన తర్వాత బొత్స పేరును ప్రకటించారాయన.మ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం కోసం..

# వందేండ్ల ఒలింపిక్స్‌లో మనమెక్కడ?

'గుమ్మిల వద్దు గుమ్మిల్లే ఉండాలె.. గూటమోలె పిల్లలుండాలంటే ఎట్లా?' అనే సామెత మన క్రీడారంగానికి సరిగ్గా సరిపోతుంది. దేశంలో క్రీడాకారులు లేరా అంటే లక్షల్లో ఉన్నారు. సత్తా లేదా అంటే సరిపడ ఉన్నది. కానీ, ప్రోత్సాహమే సున్నా. ప్రభుత్వాల నుంచి అదే కరువైంది. చిన్ననాటి నుంచే క్రీడలను ప్రోత్సహించే వాతావరణం మన దేశంలో కరువైంది. దేశంలో మైదానాలు లేని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలే అధికం. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు ఆటలెలా ఆడుతారు? క్రీడల్లో ఎలా రాణిస్తారు? అందుకే విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలుగా మారుతున్నారు.జనాభా రీత్యా యావత్ ప్రపంచంలో మన దేశానిదే అగ్రస్థానం. 142.5 కోట్ల జనాభా ఉన్న చైనాను ఎప్పుడో అధిగమించిన మన దేశం 144.17 కోట్లకు చేరుకుంది. తాజా బడ్జెట్‌లో కేంద్రం క్రీడారంగానికి రూ.3,442.32 కోట్లు కేటాయించింది. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకు ఇదే అత్యధిక మొత్తం. అయినా, ఇది మొత్తం బడ్జెట్‌లో 1.65 శాతమే. అంటే.. ఏడాదికి ఒకరికి రూ.23.90 కేటాయించారన్న మాట. అంటే.. నెలకు ఒకరికి కేవలం రెండు రూపాయలు. మనదేశంలో 14 ఏండ్లలోపువారు 24 శాతం, 10-17 ఏండ్లలోపు 17 శాతం, 10-24 ఏండ్లలోపువారు 26 శాతం మంది ఉన్నారు. ఒక్కొక్కరికి నెలకు రెండు రూపాయలు కేటాయిస్తే క్రీడల్లో ఎలా రాణిస్తారు? అందుకే వందేండ్ల విశ్వక్రీడ వేదిక ఒలింపిక్స్ చరిత్రలో మనం చాలా వెనుకబడి ఉన్నాం. అనేక దేశాలు పదుల సంఖ్యలో పతకాలు కైవసం చేసుకుంటుంటే.. అపసోపాలు పడి సాధించే ఒకటో రెండో కాంస్య పతకాలతోనే మనం సంబురపడిపోతున్నాం. ప్రధాని నుంచి ప్రముఖుల ప్రశంసలు కురిపిస్తున్నారు. సాధించినదానికి సంతృప్తి పొంది అదే విజయమనుకొని పొరపడుతున్నాం. అందుకే జనాభాలో అగ్రభాగాన ఉన్న భారత్.. విశ్వక్రీడల్లో 41వ ర్యాంకు దగ్గరే ఆగిపోయింది.'మా బడిలో ఆటలు ఎక్కువ ఆడించేవారు. రోజూ సాయంత్రం నేను కబడ్డీ ఆడేవాడిని. కొన్నాళ్లకు నేనే స్కూల్ కబడ్డీ జట్టుకు కెప్టెన్‌ను అయ్యా. అందరినీ కలుపుకొని వెళ్తూ ఒక్కమాట మీద ఉండేలా చూస్తూ రోజూ కబడ్డీ ఆడేవాడిని. ఒకరకంగా చెప్పాలంటే కబడ్డీ ఆటే నాకు నాయకత్వ లక్షణాలు నేర్పింది' అని ఇటీవల ప్రధాని మోదీ చెప్పారు. కానీ, మానవాభివృద్ధిలో ఎంతో కీలకపాత్ర పోషించే క్రీడారంగానికి నిధులు కేటాయించేందుకు మన పాలకులకు మనసు రావడం లేదు. 5 ట్రిలియన్ ప్రముఖ ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దాలనుకుంటున్నారు. ఆటలను ఎందుకో పట్టించుకోవడం లేదు. అందుకే విశ్వక్రీడా వేదికపై మన ఖ్యాతి వెలవెలబోతోంది.ప్రస్తుతం పారిస్ ఒలింపిక్స్‌లో 32 క్రీడాంశాల్లో 329 పతకాలకు పోటీలు జరుగుతున్నాయి. 200కు పైగా దేశాల నుంచి 10,500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. భారత్ నుంచి 117 మంది క్రీడాకారులు 16 విభాగాల్లో పోటీ పడుతున్నారు. అంటే సుమారు 1.10 ఒక్కరు చొప్పున భారత్ నుంచి కోట్ల మంది వ్యక్తులు ఉన్నారు. 1896లో ఆధునిక ఒలింపిక్స్ ప్రారంభం కాగా, భారత క్రీడాకారులు ఇప్పటివరకు 25 సార్లు ఉన్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో అత్యధికంగా ఏడు పతకాలు గెలవడమే మన రికార్డు. ఒకే ఒలింపిక్స్‌లో మనం పట్టుమని పది పతకాలు గెలుచుకోలేకపోతున్నాం. గత 12 దశాబ్దాల ఒలింపిక్స్ చరిత్రలో భారత్ మొత్తం 35 పతకాలు మాత్రమే గెలుచుకోగలిగింది. వీటిలో 10 స్వర్ణ, 9 రజత, 16 కాంస్య పతకాలున్నాయి. ఒలింపిక్స్‌లో మొత్తం 204 దేశాలు తలపడుతుంటే 2020 టోక్యో ఒలింపిక్స్ పతకాల పట్టికలో భారత ర్యాంకు 47. అంటే క్రీడల్లో మనం ఎక్కడ ఉన్నామో ఇట్టే అర్థమవుతుంది.1896లో ఆధునిక ఒలింపిక్స్ ప్రారంభమైనా భారత్ 1900 పారిస్‌లో ఒలింపిక్స్‌లోనే పాల్గొంటుంది. 1920 ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లు తొలిసారిగా పాల్గొన్నాయి.. 1928 ఆమ్‌స్టర్‌డామ్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు తొలి బంగారు పతకం సాధించిందంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వ్యక్తిగత వ్యక్తిగత పతకం సాధించడానికి 1952 గేమ్స్ వరకు వేచిచూడాల్సి వచ్చింది. పురుషుల కుస్తీలో కేడీ జాదవ్ కాంస్య పతకం సాధించడం ద్వారా చరిత్ర సృష్టించారు.. ఆ తర్వాత వ్యక్తిగత పతకం గెలుచుకోవడానికి భారత్‌కు 44 ఏళ్లు పట్టింది. అట్లాంటా ఒలింపిక్స్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో లియాండర్ పేస్ కాంస్య పతకం నెగ్గే వరకు భారత్‌కు మరో వ్యక్తిగత పతకం దక్కలేదు. భారత్ వ్యక్తిగత బంగారు పతకం సాధించడానికి 2008 బీజింగ్ ఒలింపిక్స్ వరకు వేచిచూడాల్సి వచ్చింది. పిస్టల్ షూటింగ్ పురుషుల విభాగంలో అభినవ్ బింద్రా తొలి స్వర్ణంతో చరిత్ర సృష్టిస్తే.. ఆ తర్వాత పుష్కరకాలంలోనే 2020 టోక్యో ఒలింపిక్స్‌లో బల్లెం వీరుడు నీరజ్ చోప్రా స్వర్ణ పతకం అందించాడు. ఒలింపిక్స్‌లో ఒకటి లేదా రెండు పతకాలకు పరిమితమైన భారత్.. 2008 బీజింగ్ ఒలింపిక్స్ నుంచి పతకాల సంఖ్యను పెంచుకుంటూపోతోంది. బీజింగ్ ఒలింపిక్స్‌లో 3 పతకాలు, 2012 లండన్ ఒలింపిక్స్‌లో 6, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 7 పతకాలుమనకు వచ్చాయి.ఈ నేపథ్యంలో ఒలింపిక్స్‌లో డబుల్ డిజిట్ చేరుకోవడానికి ఇంకా ఎన్నాళ్లు పడుతాయో! విశ్వక్రీడా వేదికపై టాప్ 20 ర్యాంకు కోసం ఇంకా ఎన్ని సంవత్సరాలు వేచిచూడాలో! టాప్ టెన్‌లో భారత్ నిలవడం మనం చూస్తామో లేదో! కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో క్రీడారంగానికి ఇలాగే కేటాయింపులు టే ఒలింపిక్స్‌లో పతకాల పట్టికలో టాప్‌లోకి రావడం కలలో కూడా సాధ్యం కాదేమో!


# ఆరోగ్యానికి సేంద్రియ సేద్యం...

హైదరాబాద్,అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలకు వ్యవసాయం ప్రధాన ఆర్థిక నిర్మాణం. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పర్యావరణాన్ని ప్రభావితం చేస్తాయి. అవి పోషక చక్రం, నేలకోత, కార్బన్ సీక్వెస్ట్రేషన్, అనేక ఇతర పర్యావరణ నమూనాలు. సేంద్రీయ వ్యవసాయం అనేది స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ ప్రభావం తగ్గించడానికి ప్రభావవంతమైన అభ్యాసం. వ్యవసాయ ఉత్పత్తుల్లో ఎక్కువ సేంద్రియ పదార్థాలను ఉపయోగించడం వల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావాన్ని తగ్గించవచ్చు.దాని సహజ చక్రాలను పునరుద్ధరణ ప్రక్రియలో సేవ్ చేయడం ద్వారా, సేంద్రియ వ్యవసాయం ఆహార నాణ్యతను కూడా పెంచుతుంది. సేంద్రియ వ్యవసాయం ఎక్కువగా రసాయన మందులు, పురుగు మందులు, గ్రోత్ హార్మోన్లు, పశువుల కార్యకలాపాలకు సంబంధించిన ఫీడ్ సంకలితాలను మినహాయించవచ్చు. సేంద్రియ వ్యవసాయం పరిమితులు, సవాళ్లను తగ్గించడానికి కొత్త సాంకేతికతల కలయిక చాలా ముఖ్యమైనది. వినూత్న పద్ధతులు, కొత్త విధానాలు సుస్థిరత వ్యవసాయ వ్యవస్థ వైపు కొత్త పోకడలను తయారు చేస్తాయి.పర్యావరణ అనుకూల మార్గంలో వ్యవసాయ ఉత్పాదకత, నాణ్యతను పెంచుతాయి. మరో మాట లో చెప్పాలంటే సేంద్రియ వ్యవసాయం గ్లోబల్ అగ్రికల్చర్ స్థిరత్వ భావనలకు అద్దం పడుతుంది. సేంద్రియ వ్యవసాయం భావన 1940లో ఉద్భవించింది. దీనిని నార్త్‌బోర్న్ స్థాపించింది. ఈ ప్రక్రియలో జంతువులు లేదా మొక్కల వ్యర్థాలు వంటి సహజ సమ్మేళనాల ద్వారా వ్యవసాయం ఉంటుంది. వ్యవసాయం అనేది పంట ఉత్పత్తి, జంతువుల పెంపకం వాటితో ఉన్న మానవ కార్యకలాపాల అత్యంత ప్రాథమిక రకం.వ్యవసాయ ప్రపంచంలోని విస్తారమైన, వైవిధ్యమైన వనరులలో అత్యంత ప్రాథమికమైనది. దాని ప్రపంచ జనాభాకు ఆహారం, ఆశ్రయం లభిస్తుంది. వ్యవసాయం ఖచ్చితమైన ప్రారంభం తెలియనప్పటికీ, మానవ జనాభా అభివృద్ధి చెందడంతో, చేపలు పట్టడం, వేటాడడం అనేది క్షేత్రంలో లేనివాటిని భర్తీ చేసే సాధనంగా మరింత ముఖ్యమైనది. ఆహారం కోసం అంతులేని అన్వేషణ ఏర్పడింది. మానవులు సుదీర్ఘమైన, సురక్షితమైన జీవితాన్ని గడపాలంటే ఆహార ఉత్పత్తి అవసరమని స్పష్టమైంది. దీన్ని బట్టి వ్యవసాయానికి ప్రాముఖ్యత ఈ వాదన నుండి ఉద్భవించిందని స్పష్టమవుతుంది.ప్రపంచ వ్యాప్తంగా గృహ వ్యవస్థలో వ్యవసాయం ప్రసిద్ధి చెందింది. ప్రజలు తమకుటుంబాలను పోషించుకోవడానికి, జీవనోపాధి పొందేందుకు, వ్యాపారాన్ని వ్యవసాయంపై ఆధారపడతారు.సేంద్రియ వ్యవసాయం రెండు రకాలుగా విభజించబడింది. 1) సమీకృత సేంద్రియ వ్యవసాయం 2). స్వచ్ఛమైన సేంద్రియ వ్యవసాయం. స్వచ్ఛమైన సేంద్రియ వ్యవసాయం అంటే అన్ని అసహజ రసాయనాలను నివారించడం. ఈ వ్యవసాయ ప్రక్రియలో అన్ని పదార్థాలు, పురుగు మందులు సహజమైన ఎముకల భోజనం లేదా రక్త భోజనం వంటి వాటి నుండి పొందబడతాయి. సమీకృత సేంద్రియ వ్యవసాయం అనేది పర్యావరణ అవసరాలు, డిమాండ్లను సాధించడానికి తెగులు నిర్వహణ, పోషకాల నిర్వహణ ఏకీకరణను కలిగి ఉంటుంది. సేంద్రియ వ్యవసాయం ప్రయోజనాలు ఆర్థికపరమైనవి. సేంద్రియ వ్యవసాయంలో పంటల పెంపకానికి ఖరీదైన మందులు, పురుగు మందులు లేదా హైబ్రిడ్ విత్తనాలు అవసరం లేదు. అందువల్ల అదనపు ఖర్చులేదు. పెట్టుబడిపై మంచి రాబడి కూడా వస్తుంది.చవకైన, స్థానిక ఇన్‌పుట్‌ల వినియోగంతో పెట్టుబడిపై మంచి రాబడిని రైతు పొందవచ్చు. , ప్రపంచ వ్యాప్తంగా సేంద్రియ ఉత్పత్తులకు దేశంలో భారీ డిమాండ్ ఉంది. ఇది ఎగుమతి ద్వారా ఎక్కువ ఆదాయాన్ని పొందుతుంది. రసాయన ఉత్పత్తులను వినియోగించే ఉత్పత్తులతో ఆహారం, సేంద్రియ ఉత్పత్తులు మరింత పోషకమైనవి, రుచికరమైనవి, ఆరోగ్యానికి మంచివి. సేంద్రియ పదార్థాలు వ్యవసాయం రసాయనాలు, ఎరువులులేనిది కాబట్టి ఇది పర్యావరణానికి హాని కలిగించదు. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలలో సేంద్రీయ వ్యవసాయం జరుగుతోంది. భారత్ లో ఉత్పత్తి చేయబడిన అన్ని సేంద్రియ టీలలో దాదాపు 30% ఎగుమతి అవుతుంది. ఈ శాతం ప్రతి సంవత్సరం పెరుగుతోంది. కర్ణాటక -కేరళ సరిహద్దుల్లో ఈ పద్ధతిలో కాఫీ, టీ, మిరియాలు, ఏలకు తదితర పంటలు



సాగు చేస్తున్నారు. భారత ప్రభుత్వం వివిధ విధానాల ద్వారా సేంద్రియ వ్యవసాయాన్ని ఆశ్రయించమని రైతులను ప్రోత్సహిస్తోంది. వీటిలో సబ్సిడీలు, శిక్షణా కార్యక్రమాలు, సేంద్రియ ధ్రువీకరణ విధానాలున్నాయి. ఎందుకంటే రైతులు సేంద్రియ అభ్యాసాన్ని స్వీకరించడానికి, ఫలవంతమైన ఫలితాలను పొందేందుకు మద్దతు ఇస్తారు.సేంద్రియ పండ్లు, కూరగాయలు, ఇతర ఉత్పత్తులు ఏ విధమైన రసాయనాలు, జన్యుపరంగా మార్పు చెందిన ఆహారం, హెర్బిసైడ్లు లేదా పురుగు మందులకు లోబడి ఉండవు. అందువల్ల అవి చాలా విలువైనవి. మొక్కకు కావలసిన స్థూల, సూక్ష్మపోషక పదార్థాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, కాల్షియం, మెగ్నీషియం, గంధకం, ఇనుము, జింకు, రాగి మొదలగు మూలకాలను సరఫరా చేస్తుంది. నేల భౌతిక స్థితిగతులను మెరుగుపరుస్తుంది. అంటే నీరు నిల్వ ఉంచే శక్తి, నేలలో గాలి ప్రసరణ, మట్టి రేణువులు ఒక దాని కొకటి పట్టి ఉంచే శక్తి మెరుగుపడతాయి. భూసారం, నేల ఉత్పాదక శక్తి మెరుగవుతాయి. సేంద్రియ మందుల వాడకం వలన భూమిలో సూక్ష్మ పోషక పదార్థాల నిష్పత్తి మారుతుంది. దీని వలన భూమిలోని మొక్కలకు హాని కలిగించే నులిపురుగులు, శిలీంద్రాలు కొంత వరకు అదుపులో ఉంటాయి. రసాయనిక మందుల వాడకం తగ్గుతుంది. సేంద్రియ మందుల నుంచి నత్రజని మెల్లగా విడుదల అవడం వలన నత్రజని నష్టం తక్కువగా ఉంటుంది. నేలలోని సూక్ష్మజీవులకు మంచి ఆహారం గాను, అవి అభివృద్ధి చెంది చురుకుగా పని చేయడానికి ఉపయోగపడుతుంది.పండ్లు, కూరగాయలు, ఇతర పంటలలో నాణ్యత పెరుగుతుంది. ఉప్పు నేలలు, చౌడునేలలో లవణ, క్షార గుణాలు తగ్గించి పంటల దిగుబడులను పెంచడంలో దోహద పడుతుంది. బరువు నేలలు గుల్లబారి వేర్లు చక్కగా పెరగడానికి. నీరు ఇంకడం పెరిగి మురుగు మెరుగవుతుంది. నీటిని గ్రహించి తేమను ఎక్కువ కాలం పట్టి ఉంచే శక్తి పెరగడానికి దోహదపడుతుంది. మెట్ట పరిస్థితిని తట్టుకునే శక్తి పెరుగుతుంది. భూమిలోని వ్యాధికారక సూక్ష్మజీవులను నశింపచేసి మొక్కలకు రక్షణ కల్పిస్తాయి. మొక్కలలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. వాడటం తేలిక, వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. సేంద్రియ వ్యవసాయం సింథటిక్ రసాయనాల వాడకాన్ని ఎక్కువగా ఉంటుంది. రైతులు తెగుళ్లు, కలుపు నియంత్రణ సహజ శిక్షణను ఉపయోగించడం.లాభదాయకమైన కీటకాలు జోడించడం, సహచర నాటడం, పంట మార్పిడి. రసాయనాల ఈ తక్కువ ఉపయోగం ఆహారంలో రసాయన అవశేషాల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నేల, గాలి, నీటి కలుషితాన్ని నిరోధిస్తుంది. పర్యావరణం, మానవ ఆరోగ్యాన్ని పెంపొందించే పరిశోధనల్లో సేంద్రియ వ్యవసాయం ఒకటి. సహజ వ్యవసాయాన్ని స్వీకరించడం ద్వారా పర్యావరణం, ఆర్థిక, భవిష్యత్తు, శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇస్తారు. సేంద్రియ వ్యవసాయం యొక్క ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పర్యావరణాన్ని ఆశించడం కోసం పెట్టుకుంది. ఇది పర్యావరణ వ్యవస్థను క్షీణింపజేయడానికి బదులుగా దానిని నిర్వహించడంపై దృష్టి పెడుతుంది. ఈ ప్రక్రియ సహజమైన విధానం ద్వారా వర్గీకరించబడుతుంది. ఇది సింథటిక్ రసాయనాలను ఉపయోగించకుండా చేస్తుంది. పోషకమైన, రుచికరమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందిస్తుంది. ఇన్ని ఉపయోగాలు కనిపిస్తున్నప్పుడు మన రైతన్నలు ఈ సేంద్రియ నిపుణులను సంప్రదించి లాభదాయక పథంలో పయనించాలని ఆశిద్దాము.

# సామాన్యుడే 'పద్మ'వ్యూహాన్ని ఛేదిస్తాడు!



న్యూఢిల్లీ,బడ్జెట్ మీద లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జులై 29న చేసిన ఉపన్యాసం చాలా ఆసక్తిగా, ఆర్ద్రంగా అర్థవంతంగా ప్రజల పక్షాన సాగింది. ఆరెస్సెస్, బిజెపిలకు వారి స్థాయి ఏమిటో చూపించింది. ప్రతిపక్షాల ప్రదర్శన ఏకం చేసి, 'ఇండియా' వేదిక నాయక మాట్లాడిన తీరు, మరీ ముఖ్యంగా అధికార బిజెపి వారికి అర్థమయ్యేట్లు పురాణ ఘట్టాలను ఉదహరించి ఉపన్యాసం తెలుగులో సంక్షిప్తంగా.స్పీకర్ సర్! నా ఉపన్యాసాలలో నేను తరచూ చెపుతూనే ఉన్నాను. ప్రస్తుతం మన భారతదేశంలో భయానక వాతావరణం ఉంది. అధికార పక్షంలో ఉన్న నా స్నేహితులు నవ్వుతున్నారు. కానీ, వాళ్ళు కూడా భయపడుతున్నారు. నాకు తెలుసు బిజెపిలో కేవలం ఒకే ఒక్క వ్యక్తి ప్రధాని కావడానికి కలలు కనొచ్చు. ఒకవేళ రక్షణ మంత్రి ప్రధాని కావాలనుకుంటే అక్కడ ఒక పెద్ద సమస్య ఉంది. అక్కడ కూడా భయం ఉంది. అదే భయాన్ని వారు దేశవ్యాప్తం చేశారు. అందుకే నన్ను నేను ఒక ప్రశ్న వేసుకుంటున్నాను. బిజెపి వారు దేశంలో భయాన్ని ఎందుకింత లోతుగా వ్యాప్తి చేశారూ? అని!స్పీకర్ సర్! చక్రవ్యూహంలో భయం ఉంది. హింస ఉంది. అలాంటి చక్రవ్యూహంలో అభిమన్యుణ్ణి ట్రాప్ చేసి, ఒక ఆరుగురు చుట్టు ముట్టి, నిర్దాక్షిణ్యంగా చంపేశారు. నేను ఈ చక్రవ్యూహం గురించి కొంత పరిశోధన చేసి, తెలుసుకున్నదేమంటే %-% చక్రవ్యూహానికి మరొక పేరుందని, దాన్నే పద్మవ్యూహమంటారని !! అంటే ఆ వ్యూహం కమలం పువ్వు ఆకారంలో ఉంటుందట. లోటస్ ఫార్మేషన్- 21వ శతాబ్దంలో కూడా ఒక కొత్త చక్రవ్యూహం- 'పద్మ'వ్యూహం తయారైంది. అది కూడా కమలం పువ్వు ఆకారం లోనే ఉంటుంది. ఆ కమలం పువ్వు గుర్తునే మన దేశ ప్రధాని తన ఛాతీ మీద పెట్టుకుని తిరుగుతుంటాడు. ఆనాడు అభిమన్యుణ్ణి బంధించి, హింసించిన విధంగానే, ఈనాడు ఈ 'పద్మ' వ్యూహం కూడా ఈ దేశాన్ని బంధించింది. దేశంలోని రైతులను, యువతీ యువకుల్ని, తల్లుల్ని, అక్కా చెల్లెళ్లను, చిన్న వ్యాపారస్థులను, మధ్యతరగతి వ్యాపారస్థులను బంధించింది. స్పీకర్ సర్‌ఆనాడు మూకుమ్మడిగా అభిమన్యుణ్ణి చంపిన ఆరుగురు ఎవరంటే- ద్రోణాచార్య, కర్ణుడు, కృపాచార్య, కృతవర్మ, అశ్వద్ధామ, శకుని. ఈనాటి చక్రవ్యూహంలో కూడా ఆరుగురు ఉన్నారు. వారెవరంటే %-% నరేంద్ర మోడీ జీ, అమిత్‌షా జీ, మోహన్ భగవత్ జీ, అజిత్ దోవల్ జీ, అదానీ జీ, అంబానీ జీ.ఈ 'పద్మ'వ్యూహపు ఉద్దేశమేమంటే-దేశ ఆర్థిక శక్తిని తమ ఆధీనంలో ఉంచుకోవడం. అదీ కేవలం ఇద్దరి దగ్గరే ఉండాలనుకోవడం. సరే ఇక ఇప్పుడైనా, ఈ బడ్జెట్‌లో గతంలో చేసిన తప్పులు సవరించుకుంటారేమోనని అనుకున్నాం. కానీ అలా జరగలేదు. రైతులకు, యువతకు ఈ బడ్జెట్ కొంత సహాయకారిగా ఉంటుందని భావించాం. కానీ, అలా జరగలేదు. చిన్న, మధ్య తరగతి వ్యాపారస్థులకు మేలు జరగలేదు. వీరందరి జీవితాల్ని ఈ బడ్జెట్ ధ్వంసం చేసింది. ఇదంతా 'పద్మ'వ్యూహంలో భాగం. నోట్‌బందీ, జిఎస్‌టి, టాక్స్ టెర్రరిజం %-% ఆపడానికి ఈ బడ్జెట్‌లో ఏ వెసులుబాటూ లేదు.ఒక వైపు మీ పద్మవ్యూహం నిరుద్యోగాన్ని పెంచుతోంది. మరో వైపు మీ పద్మవ్యూహం పేపర్లు లీక్ చేస్తోంది. ఈ దేశపు యువత ఏమైపోవాలని అనుకుంటున్నారు. గత పదేళ్ళ మీ పాలనలో దేశంలో డెబ్బయి సార్లు పరిక్ష పేపర్లు లీక్ అయ్యాయి. యువతీ యువకులకు పేపర్‌లీక్ చాలా పెద్ద సమస్యను ఎదుర్కోవడానికి, యువతకు న్యాయం చేయడానికి ఈ బడ్జెట్‌లో ఒక్కటంటే ఒక్క మాట కూడా లేదు. మరో విశేషమేమంటే మిమ్మల్ని మీరు దేశభక్తులని ప్రకటించుకుంటారు. కానీ, దేశ రక్షణ బాధ్యతను మీరు అగ్నివీర్ జవాన్ల గురించి ఆలోచించరు. వారికి పెన్షన్ ఇవ్వడానికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించారు. ఆ రకంగా మీరు మన సైనికులను. 'అగ్నివీర్' అనే పద్మవ్యూహంలో ఇరికించారు.అన్నదాతలైన రైతులను నల్ల చట్టాల చక్రవ్యూహంలో బంధించారు. మీ పద్మవ్యూహం లోంచి బయట పడడానికి వారు ఒకే ఒక్క విషయం అడిగారు. లీగల్ గ్యారెంటీడ్ ఎం.ఎస్.పి. కావాలని డిమాండ్ చేశారు. దానిమీద మాట్లాడకపోగా, వారి రోడ్డు మూసేశారు. సరే, ఈ బడ్జెట్‌లో రైతులు అడిగిన ఒక్క కోర్కెను దృష్టిలో ఉంచుకుని కేటాయింపులు చేసి ఉంటే...మీ పద్మవ్యూహం లోంచి కొంత వరకు బయట పడేవారు. కానీ, అది జరగలేదు.అవకాశం దొరికితో చాలు మీరు చక్రవ్యూహాలు ఏర్పాటు చేస్తారు. మేం మీ చక్రవ్యూహాన్ని, పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టే పనిలో ఉన్నాం. భారతదేశంలో ప్రజలెవరూ కలలు కనగూడదని మీరు భావిస్తున్నారు. కేవలం ఎ 1, ఎ 2 (అదానీ, అంబానీ) మాత్రమే కలలు కనడానికి అర్హులు అని మీరనుకుంటారు. ఆ ఇద్దరే దేశంలోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంట్రోల్ చేస్తారు. వారి దగ్గరే టెలికామ్ సిస్టమ్ ఉంది. ఎయిర్ పోర్టులున్నాయి. ఇప్పుడిక రైల్వేలను ఆక్రమించాలనే ప్రయత్నంలో ఉన్నారు. సంపదకు సంబంధించిన ఏకఛత్రాధిపత్యం వీరి దగ్గరే ఉంది.స్పీకర్ సర్! దేశంలో మరొక ముఖ్యమైన సమస్య ఉంది. దానిమీద ఈ బడ్జెట్ దృష్టి పెట్టలేదు. ఈ దేశంలో దళితుల, ఆదివాసీల, మైనార్టీల, వెనకబడిన వర్గాల సంఖ్య అధికం. సుమారు 90-95 శాతం. ప్రజలు వారే, అయితే వారికి అందుకే స్థానం దొరకదు. పెద్దపెద్ద వ్యాపారాల్లోగానీ, ప్రభుత్వ ఉత్పత్తిలో గానీ, ముఖ్యమైన చోట్ల ఎక్కడా వారికి

# అవయవదానం ఆవశ్యకతను గుర్తించాలి

విజయవాడ,అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నా... ప్రజల్లో మార్పు రాలేదన్నారు. జీవన్ దాన్ పై అవగాహన కార్యక్రమంలోపాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే బోండా ఉమ పాల్గొన్నారు. ఇదే వేదిక పై అవయవదానానికి అంగీకరిస్తూ మంత్రి సత్యకుమార్ సంతకం చేశారు. అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులను సత్యకుమార్, బోండా ఉమ సత్కరించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ.. మన రాష్ట్రం లో 260 మంది అవయవ దానంకోసం ముందుకు వచ్చారన్నారు. తెలంగాణలో ఎనిమిది వందల మంది ముందుకు వచ్చారన్నారు. 90 వేల మంది అవయవ దానం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. యేటా ఐదు లక్షల మంది అవయవాలు చెడిపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని సత్యకుమార్ అన్నారు. జాతీయ స్థాయిలో చాలా స్వల్పంగా ఈ అవయవ దానమ రిజిస్ట్రేషన్ లు ఉన్నాయన్నారు. కొంత మందికి మతాచారాలు అడ్డుగా వస్తున్నాయని అంటున్నారన్నారు. తీసుకునేందుకు లేని అభ్యంతరం ఇచ్చేందుకు లేదన్నారు. ఈ దేవుడు అయినా పరులకు మంచి చేయమనే చెబుతారన్నారు. డయాలసిస్ సెంటర్ల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. కిడ్నీల మార్పిడి కోసం ప్రజలు చాలా మంది క్యూలో ఉన్నారన్నారు. అవయవ దానం వల్ల అంత్యక్రియలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ అంశాలను సీఎం చంద్రబాబు దృష్టి కి తీసుకెళతానని సత్య కుమార్ పేర్కొన్నారు. అవయవదానం చేసిన వారి అంత్యక్రియల్లో కలెక్టర్, ఎస్పీ పాల్గొని వీరవందనం చేసేలా మార్పులు తెస్తామన్నారు. ఆర్థికంగా కూడా ఆ కుటుంబానికి ఎంతో కొంత సాయం అందించాలని సత్యకుమార్ పేర్కొన్నారు. ఈ మార్పులపై సీఎం సానుకూలంగా స్పందిస్తారని భావిస్తున్నానన్నారు. అవయవదానంలో భాగస్వామ్యం అవుతున్న వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ఉన్న వారికి ధన్యవాదాలు తెలిపారు. ఇంకా సమాజంలో మార్పు రావాలి, ప్రజల్లో చైతన్యం కలిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సత్యకుమార్ పేర్కొన్నారు. వేల మందికి పునర్జన్మ కలిగించేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. తాను కూడా బాధ్యతగా అవయవదానానికి అంగీకరిస్తూ సంతకం చేశానన్నారు. తన కుటుంబ సభ్యులకు సైతం సమాచారం ఇచ్చానని సత్యకుమార్ తెలిపారు.

## విడివిడిగా రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు

హైదరాబాద్,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కొత్త రేషన్ కార్డుల జారీ విధివిధానాల రూపకల్పనకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు విడిగా ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. జీహెచ్‌ఎంసీలో ఔటర్ గ్రామాల విలీనానికి కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రులు సీతక్క,శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమిర్‌ఖాన్‌ల పేర్లను మరోమారు రెకమండ్ చచేస్తూ గవర్నర్‌కు తీర్మానం పంపాలని కేబినేట్ నిర్ణయించింది. అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. దాదాపు రెండు గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ధరణి పేరును భూమాతగా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సమావేశం ముగిసిన తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయడానికి రూ.437 కోట్లు విడుదలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అసెంబ్లీలో శుక్రవారం జాబ్ క్యాలెండర్ ప్రకటించబోతున్నట్లు వెల్లడించారు. ఎన్నికల మేనిఫెస్టోలని అంశాలను తప్పక నెరవేరుస్తాం అన్నారు. క్రీడాకారులు ఈషాసింగ్, నిఖత్ జరీన్, సిరాజ్‌కు ఒక్కొక్కరికీ 600 గజాల చొప్పున హైదరాబాద్‌లో ఇంటి స్థలం, నిఖత్ జరీన్, సిరాజ్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. విధుల్లో చనిపోయిన రాజీవ్ రతన్ కుమారుడికి మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం, మరో అధికారి మురళి కుమారుడికి గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇద్దరు ఎమ్మెల్సీల నియామకంపై గవర్నర్‌కు మళ్లీ ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించాం. కోదండరాంరెడ్డి, అమిర్ ఖాన్ పేర్లను మరోసారి గవర్నర్‌కు పంపిస్తాం. నిజాం చక్కెర పరిశ్రమ పునరుద్ధరణకు, హైదరాబాద్‌లో మూసీ సుందరీకరణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్ జంట జలాశయాలకు తరలిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. కొత్త రేషన్ కార్డుల జారీకి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధివిధానాల రూపకల్పనకు కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన రేషన్ కార్డుల జారీ విధివిధానాల సబ్ కమిటీ ఏర్పాటు కానుంది. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు విడివిడిగా ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.జీహెచ్‌ఎంసీలో ఔటర్ గ్రామాల విలీనానికి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్క వ్యవహరించనున్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాది నిర్దిష్టమైన కాల వ్యవధిలో ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు జాబ్ క్యాలెండర్‌ను కేబినెట్ ఆమోదించింది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ నెల 2వ తేదీన అసెంబ్లీ వేదికగా జాబ్ క్యాలెండర్ ప్రకటించబోతున్నట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. కేరళలో వయనాడ్‌లో భారీ వర్షాలతో పాటు కొండచరియలు విరిగిపడి చాలా మంది చనిపోయారు. కేరళలో జరిగిన విషాదంపై తెలంగాణ కేబినేట్ సంతాప తీర్మానం ఆమోదించింది. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేసింది. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు ముందుకు వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. రేషన్ కార్డుల జారీతో పాటు రాష్ట్ర ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్‌తో హెల్త్ కార్డులను జారీ చేయాలని కేబినెట్ చర్చించింది. దీనికి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేసేందుకు రెవెన్యూ శాఖ మంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి, సివిల్ సప్లయిస్ మంత్రితో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. త్వరలోనే అర్హులైన పేదలందరికి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని మంత్రి ప్రకటించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుడి, ఎడమ కాల్వలు పూర్తి చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దాదాపు రెండు వేల ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు అవసరమయ్యే నిధులతో సవరణ అంచనాలను రూపొందించాలని నిర్ణయం తీసుకుంది. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తగిన చర్యలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. రెండో విడతగా చెల్లించాల్సిన బకాయిల చెల్లింపులకు ఆమోదం తెలిపింది. అవసరమైతే ఇథనాల్, విద్యుత్తు ఉత్పత్తికి అక్కడి ఫ్యాక్టరీల్లో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చర్చించింది. శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘానికి ఆ బాధ్యతలు అప్పగిం చింది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటిని శామీర్‌పేట చెరువు నింపి, అక్కడి నుంచి హైదరాబాద్‌లో ఉన్న జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు తరలించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 15 టీఎంసీలను తరలించి, అందులో 10 టీఎంసీలతో

## సాగర్‌కు నీటి విడుదల

నంద్యాల,శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో జలాశయం 10 గేట్లను 18 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో నాగార్జునసాగర్‌కు వరదనీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం ఇన్ ఫ్లో : 4,65,261 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో : 4,91,602 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం : 883.80 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం : 208.7210 టీఎంసీలకు చేరుకుంది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. శ్రీశైలం డ్యాం దిగువన వరదనీటిలో వ్యక్తి గల్లంతు అయిన ఘటన కలకలం రేపుతోంది. శ్రీశైలం జలాశయం లింగాలగట్టు పెద్ద బ్రిడ్జ్ కింద స్నానానికి దిగి వరద నీటిలో అందరూ చూస్తుండగానే నీటిలో కొట్టుకుపోయి వ్యక్తి గల్లంతు అయ్యాడు. అతను నల్లగొండ జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన చొప్పరి యాదయ్య (50)గా గుర్తించారు. శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనార్థం స్నేహితులతో కలిసి యాదయ్య వచ్చాడు. యాదయ్య కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలావుంటే ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఒకటో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకోవడం జరిగింది. గోదావరి నీటిమట్టం11.50.అడుగులకు తగ్గింది. 175 గేట్లను అధికారులు పూర్తిగా ఎత్తివేసి 9.52 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. 14 రోజుల తర్వాత లంక గ్రామాలకు వరద ప్రవాహం తగ్గింది. పునరావాస కేంద్రాల నుంచి వరద బాధితులు ఇళ్లకు చేరుకుంటున్నారు. వరద ప్రవాహంలో మునిగిపోయి ఉద్యాన, కాయగూరలు పంటలు కుళ్లిపోయాయి. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను అధికారులు ప్రభుత్వానికి పంపారు. ÷రిశిలవరం ప్రాజెక్టు వద్ద ప్రస్తుత గోదావరి నీటిమట్టం స్పిల్ వే ఎగువన 32.205 మీటర్లుగా ఉంది. స్పిల్ వే దిగువన 23.950 మీటర్లు నీటిమట్టం నమోదు అయ్యింది. 48 రేడియల్ గేట్ల ద్వారా 9,00,372 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ఏలూరు జిల్లా.. తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్ ఫ్లో 515 క్యూసెక్కులు కాగా... అవుట్ ఫ్లో 1048 క్యూసెక్కులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటిమట్టం: 355 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం: 349.62 అడుగులకు చేరుకుంది. ప్రస్తుత నీటి నిల్వ: 2.030 టీఎంసీలు కాగా.. పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం: 3 టీఎంసీలకు చేరుకుంది.

## వయనాడ్ బాధితులకు చిత్రపరిశ్రమ అండ

చెన్నై,వయనాడ్ విషాదంతో యావత్ దేశం వణికిపోతోంది. కేరళలోని వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడటంతో 300 మందికి పైగా మరణించారు. మరో 200 మందికి పైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విపత్తుపై ప్రముఖులు కూడా స్పందిస్తున్నారు. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు లక్షల రూపాయలు విరాళంగా అందజేసి బాధితులకు సహాయం చేస్తున్నారు. వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు.. పలువురు ముందుకు వస్తున్నారు. ప్రముఖ తమిళ సినీ నటుడు సూర్య కుటుంబం వయనాడ్ బాధితుల సహాయార్థం రూ. 50 లక్షల రూపాయలను విరాళంగా అందించింది. అలాగే సూర్య భార్య జ్యోతికతో పాటు సూర్య సోదరుడు కార్తీ చేతులు కలిపారు. సూర్య, జ్యోతిక, కార్తీలను ప్రజలు అభినందిస్తున్నారు. ఈ మొత్తాన్ని సూర్య కుటుంబం సీఎం సహాయ నిధికి అందించింది. స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న వయనాడ్ బాధితుల సహాయార్థం కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల విరాళం అందించి ఉదారతను చాటుకుంది. అలాగే కోలీవుడ్ స్టార్ నటుడు విక్రమ్ కూడా 20 లక్షల రూపాయలు అందించారు.ప్రముఖ మలయాళ సినీ నటుడు మమ్ముట్టి కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి 25 లక్షల రూపాయల విరాళం అందించారు. మమ్ముట్టి తనయుడు దుల్కర్ సల్మాన్ 15 లక్షల రూపాయలు ఇచ్చాడు. మమ్ముట్టి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా కూడా సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ట్రస్ట్ ముందుకొచ్చింది. బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, బట్టలు తదితరాలను కూడా అందజేస్తున్నారు. రూ. 25 లక్షల రూపాయలు ఇస్తానని మాలీవుడ్‌కు చెందిన ఫహద్ ఫాసిల్, అతని భార్య నజ్రియా నజీమ్ ప్రకటించారు. ఈ విపత్తులో ఇప్పటికే వేలాది మందిని రక్షించారు. మరికొంతమంది సినీ ప్రముఖులు కూడా వయినాడ్ బాధితులను ఆదుకుందుకు ముందుకు వస్తున్నారు. ఆదానీ లాంటి వారు ఇప్పటికే తమవంతు సాయం ప్రకటించారు.

## జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు

నిజామాబాద్, విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు పంజా విసురు తున్నాయి. దీంతో నిజామాబాద్ జిల్లాలోని దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో రోగుల సంఖ్య పెరుగుతున్నది. ఇదే అదనుగా ప్రైవేట్ ఆస్పత్రుల దందా కూడా మొదలయ్యింది. డెంగ్యూ, గున్యాల భయంతో ప్రజలు ప్రైవేట్ చికిత్సలకు వెళు తున్నారు. ఇదే అదనుగా పరీక్షల పేరుతో వేలల్లో గుంజేస్తున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ దవాఖానలతో పాటు ప్రైవేట్ దవాఖానలకు రోగుల తాకిడి పెరిగింది. వాతావరణ మార్పులతో పాటు నీటి నిల్వ కారణంగా దోమలు పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయి. జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఫీవర్ వార్డు ఏర్పాటు చేయగా రోగుల తాకిడి పెరిగింది. ప్రస్తుత పరిస్థితులను ప్రైవేట్ దవాఖానలు సొమ్ము చేసుకుంటున్నాయి. విచ్చలవిడిగా బిల్లులు వేస్తూ దండుకుంటున్నాయి. మరోవైపు, ప్రభుత్వ దవాఖానల్లోనే అంటే జీజీహెచ్‌లో చేయాల్సిన డెంగీ పరీక్ష ఎలిసా టెస్ట్‌లను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్‌లో చేస్తున్నారు. సాధారణ జ్వరాలను సైతం డెంగీ పేరు చెప్పి, ప్లేట్‌లెట్స్ పడిపోయాయని రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బిల్లులు వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన, మెడికల్ కాలేజీలో పని చేసే కొందరు వైద్యులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు.. ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. జీజీహెచ్‌లో అన్ని వసతులు ఉన్నప్పటికీ సదరు వ్యక్తులు.. బాధితులను తమ సొంత దవాఖానకు తరలించి వారి నుంచి దండుకుంటున్నారు.

### స్వాతంత్ర్య పోరాట యోధుడు..జాతీయ పతాక రూపకర్త పింగళి

విజయవాడ,జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య.. మహాత్మాగాంధీ సమకాలికుల్లో ఒకరు..పింగళి 1876,ఆగస్టు 2న కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రులో జన్మించారు.పింగళి వెంకయ్య స్వాతంత్ర్య సమరయోధుడే గాకుండా ...మన జాతీయ పతాక రూపకర్త. మన త్రివర్ణ పతాకం గాంధిజీ ప్రోద్బలంతో పుట్టింది మన తెలుగు నేలమీదే. కాషాయ రంగు హిందువులకు చిహ్నమని, ఆకుపచ్చ ముస్లిములకు అని పేర్కొనడముతో ఇతర మతాలకు కూడా ప్రాధాన్యత ఇస్తూ గాంధీజీ సూచనలపై ఆకుపచ్చ, కాషాయ రంగులతో పాటు తెలుపును కూడా చేర్చి త్రివర్ణపతాకాన్నిపింగళి రూపొందించాడు. మధ్యలో ఉండే రాట్నము గ్రామీణ జీవితాన్ని రైతు కార్మికత్వాన్ని స్ఫురింపచేస్తుందని అయన భావన. మన ఆశయాలకు భారతదేశంఅవలంబించే సత్యం, అహింసలకు చిహ్నమే మన త్రివర్ణ పతాకం. అప్పట్లో ఈ జెండాను పింగళి కాంగ్రెస్ పార్టీకి స్వాత

# విపత్తు నిర్వహణకు పటిష్ట వ్యవస్థ అవసరం !



న్యూఢిల్లీ,వయనాడ్‌లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 300మందికపైగా మృత్యువాత పడ్డట్లు, మరో 300కు పైగా గల్లంతు అయినట్లు వార్తలు వస్తున్నాయి. నిజంగా ఇదో జాతీయ విపత్తు. దేశం యావత్తూ మృతుల కుటుబాలకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. జాతీయ విపత్తులు సంభవించి నప్పుడు తోణ సాయంతో పాటు పునరావాసం కూడా ముఖ్యం. సర్వస్వం కోల్పోయిన వారికి అండగా ఉండి వారు తిరిగి జీవనం సాగించేలా చూడాలి. ఇది జాతి బాధ్యతగా గుర్తించాలి. విపత్తుల సమయంలో సకాలంలో స్పందించేలా వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏటా దేశవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాల మూలంగా పెద్దయెత్తున నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధానమైన డ్యాముల గేట్లను తెరవాల్సి రావడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకుని విలవిల్లా డుతున్నాయి.

విపత్తుల సమయంలో స్వతంత్ర వ్యవస్థ రంగంలోకి దిగి ప్రజలను కాపాడడంతో పాటు, సహాయాక చర్యల్లో నిమగ్నమయ్యేలా ఉంటే విమర్శలకు ఆస్కారం ఉండదు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ తమిళనాడు, తెలంగాణ, ఎపిల్లో ఏటా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో ప్రజాజీవనం అతలాకుతలం అవుతున్నాయి. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, విరిగిపడుతున్న కొండ చరియలు, తెగిపోయిన రోడ్లు సాధారణ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలను సకాలంలో సహాయక శిబిరాలకు తరలించడం, ప్రాణనష్టాన్ని తగ్గించగలగడం అన్నది ఇలాంటి సమయాల్లో ముఖ్యం. పునరావాస శిబిరాల్లో బాధితులకు మంచినీరు, ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడం, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రత్యేక యంత్రాంగం ఉండివుంటే వెంటనే రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది. ఎన్డీఆర్ఎఫ్ దళాలు ఉన్నా దానిని మరితంగా పటిష్టం చేయాలి. దీనికి ఆర్మీ తరహా వ్యవస్థ అవసరం ఉంది. దేశంలో ఏ మూల ఎలాంటి ఉపద్రవం ముంచుకుని వచ్చినా సకాలంలో చేరుకుని సేవలు అందించే విధంగా తయారు కావాల్సి ఉంది. రైలు ప్రమాదాలు కావచ్చు.. వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో సకాలంలో సత్వరమే సేవలు అందించే వీలు కలుగుతుంది. ఇటీవలి వరదలు, రైలు ప్రమాదాలు చూశాక సుశిక్షిత సిబ్బంది అవసరముందని తెలుస్తోంది. దానికి సాంకేతికంగా సహాయ సహకారం అందించాలి. ప్రస్తుతానికి విపత్తులను ఎదుర్కోవడంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరించిన మార్గాలే ఇప్పుడు శరణ్యంగా మారాయి. ఈ దుస్తితి పోవాలంటే ఓ అత్యున్నత వ్యవస్థ అవసరం అన్నది గుర్తించాలి. కేంద్రరాష్ట్రాలు ఇందుకు ముందుకు రావాలి. ఉమ్మడిగా వ్యవస్థను తయారు చేసుకోవాలి. దీనిని ఆర్మీలో భాగంగా చేస్తే మరీ మంచిది. అలాగే దీనికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపులు కూడా జరగాలి. సాధారణ ఆర్మీ ఇలాంటి సమయాల్లో అంతగా పనిచేయకపోవచ్చు. కానీ విపత్తు నిర్వహణకు కూడా ఆర్మీలాంటి దళాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే మంచిది. భూకంపాలు, అగ్నిప్రమాలు, వరదలు లాంటి ప్రమాదాల సమయాల్లో తక్షణం స్పందించేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దేశంలో ఎక్కడ ఏ మూల ప్రమాదం జరిగినా సహాయక చర్యలకు దిగేలా తీర్చిదిద్దాలి. ఇలాంటి దళాలను ఏర్పాటు చేయడంతో పాటు, ఆర్థిక సంపత్తిని కూడా కట్టిబెడితే మంచిది. దీనిద్వారా విపత్తు నిర్వహణతో పాటు, నిరుద్యోగ సమస్యకూడా కొంతమేర తీరవచ్చు. ఈ దిశగా ఆలోచనలు చేసి ఆచరణకు సిద్దపడాలి. అప్పుడు ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా రంగంలోకి దిగేలా అవకాశం ఉంటుంది. విపత్తు నిర్వహణ అన్నది ఉమ్మడి వ్యవహారంగా ఉంటనే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఆదుకునేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా నిధులను సమకూర్చాలి. లేదా కేంద్ర,రాష్ట్రాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చాలి. అలాగే దీనిని సైన్యంలో ఒక భాగంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. భారత్ లాంటి దేశానికి ఇది తక్షణావసర మని పాలకులు గుర్తించాలి. ఇప్పటివరకు జరిగిన అనేక విప్తతులను దృష్టిలో పెట్టుకుని తగిన తర్ఫీదు ఇచ్చి స్వయం శక్తిగా దీనిని రూపొదించాలి. దేశంలో ఎక్కడ ఏ మూలన ఎలాంటి ఉపద్రవం వచ్చిపడినా తక్షణం రంగంలోకి దిగేలా అన్ని రాష్ట్రాల్లో సన్నద్దంగా ఉండేలా చూడాలి. ప్రస్తుత వ్యవస్థలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర విపత్తు, సహాయక బృందాలు ప్రశంస నీయమైన కృషిచేస్తున్నాయి. అయితే ఇందులో ప్రధాన భూమిక రాష్ట్రాలదిగానే ఉంటోంది. అలాగాకుండా ప్రకటిత పటిష్ట వ్యవస్థ ఉంటే సాయం కోసం కేంద్రంవైపు చూడాల్సిన ఆగత్యం రాదు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు, చలన చిత్ర పరిశ్రమ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు ఉదారంగా ముందుకు వచ్చి విరాళాలందిస్తున్నారు. అయితే ఏటా ఎక్కడో ఓ చోట ఇలాంటి విపత్తులు సర్వ సాధారణం గా మారిన దశలో ప్రత్యేక,శాశ్వత ఏర్పాటు అవసరాన్ని గుర్తించాలి. అసాధారణ వరదలు కావడంతో పెద్దయెత్తున ఆస్తినష్టం కలిగించాయి. ఇటీవలి వరదల్లో వేల ఎకరాల్లో పంటలు తుడిచి పెట్టుకునిపోయాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ, సహాయక అథారిటీని పటిష్ట పరచినప్పటికీ ఇప్పుడు సంభవించిన విపత్తు అసాధారణమైనది. దీనిని ఎదుర్కోవడం అంత తేలికేమీ కాదు. అయినా, పరిస్థితి తీవ్రతకు మించిన వేగంతో ప్రభుత్వం కదిలింది. నదికి ఇరువైపులా వున్న ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసింది. ఇకపోతే విపత్త బృందం ఉంటే నష్టం అంచనా కూడా వెంటనే గుర్తించ వచ్చు. అలాగే వెంటనే నష్టం అంచనాలు కూడా జరిగిపోవాలి. సహాయక చర్యలతో పాటు పునరావాస చర్యల్లో కూడా ఈ బృందాలు పాల్గొనేలా చేయాలి. ఇలా చేస్తే మంచి ఫలితాలతో పాటు సకాలంలో సాయం అందగలదు. అలాగే పునరావాసం, సహాయం కూడా విపత్తుల్లో భాగం కావాల్సి ఉంది.

# మూడు పార్టీలలో కలవరం

అమరావతి, ఏపీ ఎన్నికలలో అనూహ్య విజయం సాధించిన తెలుగుదేశం పార్టీకి అసలైన అగ్నిపరీక్ష మొదలు కానుంది. మొన్నటి ఎన్నికలలో సీట్ల పంపిణీ నుంచి మంత్రి పదవుల వరకూ కూటమితో సర్ధుబాట్లు చేసుకుంటూ తమ పార్టీనే నమ్మకుని..మొదటినుంచి వెన్నంటి ఉన్న సీనియర్ నేతలు ఇప్పటిదాకా చంద్రబాబు మీద గౌరవంతో తమ పదవులకు త్యాగం చేశారు. అయితే ఇప్పుడు వీళ్ల వంతు వచ్చింది. ఏపీకి సంబంధించి నామినేటెడ్ పోస్టులు 95 ఉన్నాయి. ఇప్పుడు ఈ 95 పోస్టులు భర్తీ చేయవలసిన బాధ్యత చంద్రబాబు ప్రభుత్వంపైనే ఉంది.

చంద్రబాబుకు కొత్త టెన్షన్

చంద్రబాబుకు ఇప్పుడు కొత్తగా టెన్షన్ వచ్చిపడింది. కూటమిని కూడా కలుపుకుపోవాలంటే నామినేటెడ్ పోస్టులలో కనీసం తమ పార్టీకి 50 శాతం, బీజేపీకి 30 శాతం, జనసేనకు 20 శాతం అయినా ఇవ్వాల్సి ఉంటుంది. నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ మళ్లీ తమకు అన్యాయం జరుగుతుందేమోనని తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వాస్తవంగా నామినేటెడ్ పోస్టులు ఎన్నికలలో బాగా కష్టపడిన వారికే కట్టబెడుతుంటారు. కార్యకర్తల పనితీరు ఆధారంగా భర్తీ ప్రక్రియ జరుగుతుంది. ఇందుకు సంబంధించిన నివేదికలు, రిపోర్టులు తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలి. అది కూడా పార్టీ క్యాడర్ కు సంతృప్తినిచ్చేలా ఉండాలి. ఇప్పుడు మూడు పార్టీలలో అలాంటి నేతల ఎంపికపై కసరత్తు జరుగుతోంది.ముందుగా పార్టీ టిక్కెట్ ఆశించి భంగపడిన నేతలు, అసంతృప్తితో రగిలిపోతున్న నేతలకు నామినేటెడ్ పోస్టులు దక్కే అవకాశం ఉంది.

వేల సంఖ్యలో అప్లికేషన్లు

క్యాడర్ లో కొందరు ఇప్పటికే తమకున్న రాజకీయ పలుకుబడి, పరిచయాలను ఉపయోగించుకుని పార్టీ అగ్రనేతల రికమెండేషన్ తో ఎలాగైనా నామినేటెడ్ పోస్టులు దక్కించుకోవాలని ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నట్లు సమాచారం. మూడు పార్టీల నుంచి వేల సంఖ్యలో అప్లికేషన్లు వచ్చాయి. ప్రస్తుతం టీడీపీ కి సంబంధించి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్క్రూటినీ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఫైనల్ గా లిస్టు ప్రిపేర్ అవుతోంది. ఏది ఏమయినా ఫైనల్ డెసిషన్ మాత్రం చంద్రబాబు మాత్రమే తీసుకోనున్నారు. అటు బీజేపీ ఆశావహులు కూడా తమ పార్టీ అధ్యక్షురాలు పురంధేశ్వరి కి వినతి పత్రాలు ఇచ్చారు. మొన్నటి ఎన్నికలలో ఎలాగోలా సర్ధుకుపోవాల్సి వచ్చిందని ఈ సారైనా తమకు న్యాయం జరిపించాలని అభ్యర్థిస్తున్నారు. జనసేన నేత పవన్ కళ్యాణ్ కు సైతం నామినేటెడ్ పోస్టుల వ్యవహారం పెద్ద తలనొప్పిగా మారింది.

గ్రూపుల భయం

ప్రస్తుతం ఆషాఢమాసం సెంటిమెంట్ ఉండటంతో వచ్చే శ్రావణమాసం లేదా దసరా లోగా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిచేయాలని భావిస్తున్నారు. విడతల వారీగా నామినేటెడ్ పోస్టుల భర్తీ ఉండబోతోంది. తొలి విడతలో 25 నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని భావిస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్,పురంధేశ్వరి కలిసి సీట్ల సర్ధుబాట్లు చేసుకుని ఫైనల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. మూడు పార్టీల క్యాడర్ నుంచి ఈ నామినేటెడ్ పోస్టుల కోసం ఒత్తిడి బాగానే ఉంది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా విడతలవారీగా భర్తీచేయబోయే నామినేటెడ్ పదవులు క్యాడర్ లో జోష్ పెంచేవిగా ఉండాలి. మళ్లీ గ్రూపులు కట్టడం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం వంటివి లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు ఈ అగ్ర నేతలపైనే ఉంది. సునామీలా తయారైన నామినేషన్ల భర్తీ ప్రక్రియను ఇప్పుడు ఈ మూడు పార్టీల అగ్రనేతలకు ఛాలెంజ్ గా మారనున్నాయి.

# మరో 1325 బస్సులు...

హైదరాబాద్, : తెలంగాణలో ప్రజా రవాణా వ్యవస్థకు పెరుగుతున్న ప్రయాణికుల తాకిడి నేపథ్యంలో మరిన్ని బస్సు సర్వీసులను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత కొన్నాళ్లుగా ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం పథకం తరువాత కొన్ని రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అధిక సంఖ్యలో మహిళలు ప్రయాణాలు సాగించడం, అదే సమయంలో పురుషులు, విద్యార్థులు, ఇతరులు సాగించే ప్రయాణాలకు అనుగుణంగా బస్సులు సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్సుల్లో పెరిగిన రద్దీను తట్టుకునేందుకు అనుగుణంగా టీజీఎస్ఆర్టిసి కొత్త బస్ సర్వీసులను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది.కొత్త బస్సులు కావాలన్న టీజీఎస్ఆర్టీసీ అభ్యర్థన మేరకు జూన్ నాటికి 1325 కొత్త బస్సులను దశలవారీగా తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే వీటిలో ఇప్పటి వరకు ఆర్టీసీకి చేరిన బస్సుల సంఖ్య అతి స్వల్పం. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని మరోసారి టీజీఎస్ఆర్టిసి నూతన బస్ సర్వీసులు అందించాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. ఈ విజ్ఞప్తి మేరకు కొద్ది రోజుల్లోనే ప్రభుత్వం నూతన బస్సు సర్వీసులను అందించేందుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వాన్ని అందించాలని కోరిన 1325 బస్సుల్లో 712 పల్లె వెలుగులు, 400 ఎక్స్ప్రెస్, 75 డీలక్స్, 138 లహరి, రాజధాని బస్సులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో ఇప్పటికే కొన్ని బస్సులు అందుబాటులోకి రాగా, మిగిలిన బస్సులు కొద్ది రోజుల్లోనే టీజీఎస్ఆర్టీసీ చేతికి అందం ఉన్నట్లు చెబుతున్నారు. వీటిలో కొన్ని బస్సులను మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకానికి వినియోగించనున్నారు. గత కొద్ది నెలలుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టీజీఎస్ఆర్టిసి అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రతిరోజు వేలాదిమంది ప్రయాణాలు సాగిస్తున్నారు. బస్సుల సంఖ్య తక్కువగా ఉండడం ప్రయాణికులు సంఖ్య అధికంగా ఉండడంతో చాలామంది ప్రమాదకర స్థాయిలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ తరహా ప్రయాణాలు ప్రమాదకరంగా పరిణమించే అవకాశం ఉన్న నేపథ్యంలో వీటికి చెక్ చెప్పేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు.నూతన ఆర్టీసీ బస్సులను అందించాల్సిందిగా ఆర్టీసీ అధికారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగర పరిధిలోనే కాకుండా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో బస్సులు కొరత వేధిస్తోంది. కొన్నిచోట్ల ఏళ్ల తరబడి వినియోగిస్తున్న బస్సులతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వీటిని పక్కన పెట్టి కొత్త బస్సులను తీసుకువచ్చే ప్రతిపాదనను ఇప్పటికే టీజీఎస్ఆర్టిసి అధికారులు పెట్టారు. ఈ ప్రతిపాదనలను అధికారులు ఇప్పటివరకు అమలు చేయకపోవడంతో ప్రజా రవాణాలో కొన్ని రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని అనేక జిల్లాల్లో ప్రజల రవాణాకు కీలకంగా వ్యవహరిస్తున్న పల్లె వెలుగు బస్సులు కూడా కొరత వేధిస్తోంది. కొన్నిచోట్ల డొక్కు బస్సులతోనే ప్రజలకు సేవలను అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఇబ్బందులను కూడా టీజీఎస్ఆర్టిసి అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం నూతన బస్సులను కొద్ది రోజుల్లోనే కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతోంది. తద్వారా తమ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకానికి మరిన్ని బస్సులను కేటాయించడంతోపాటు పల్లె వెలుగు, ఇతర సేవలకు సంబంధించిన బస్సులను భారీగా టీజీఎస్ఆర్టిసికి ప్రభుత్వం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అన్ని అనుకూలిస్తే ఆగస్టులోనే ఈ బస్సులు ప్రజలకు సేవలు అందించే అవకాశం ఉందని చెబుతున్నారు. అదే జరిగితే రాష్ట్రంలోని ప్రజా రవాణాను వినియోగించే ప్రజలకు

# ఏదీ జనగణన..



హైదరాబాద్,'త్వరలో నియోజకవర్గాల పునర్విభజన జరుగబోతున్నది. దీంతో రాష్ట్రంలో ప్రస్తుతమున్న 119 నియోజకవర్గాలు.. 140 నుంచి 150 వరకూ పెరుగుతాయి. అదయ్యాక.. మహిళా రిజర్వేషన్ల చట్టం ప్రకారం 33 శాతం సీట్లు వాళ్లకే ఇవ్వాల్సి ఉంటుంది. ఇది జరిగితే.. ఎవరి సీటు ఉంటదో? ఎవరి సీటు పోతదో? ఎవరికీ తెలియదు. అట్లాంటప్పుడు ఐదేండ్లపాటు ప్రతిపక్షంలో ఉంటే ఏమొస్తది? మా పార్టీలోకి రండి. అధికారాన్ని అనుభవించండి!'.. ఇదీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అధికార పక్షంలోని ఓ అగ్రనాయకుడు ఇస్తున్న ఆఫర్ అట! ఇంతకీ, ఆయన చెప్తున్నట్టు డీలిమిటేషన్ ఇప్పుడు జరిగే అవకాశముందా, లేదా? దీనిపై రాజకీయ విశ్లేషకులు, సెఫాలజిస్టులు ఏమంటున్నారు? దేశంలో, రాష్ట్రాల్లో చట్టసభల నియోజకవర్గాల సంఖ్య, పరిధులను నిర్ణయించే డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) జరుగాలంటే, ముందు జనగణన జరుగాలి. దేశంలో 2011లో చివరిసారిగా జనగణన నిర్వహించారు. లెక్కప్రకారం 2021లో మళ్లీ దీన్ని చేపట్టాలి. అయితే, కరోనా సంక్షోభం, సార్వత్రిక ఎన్నికల పేరిట ఈ ప్రక్రియను కేంద్రం వాయిదా వేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు జనగణనను ఇప్పట్లో చేపట్టే అవకాశం లేదని కొందరు అంటుంటే, వచ్చే ఆర్థిక సంవత్సరం ఈ ప్రక్రియ మొదలుకావొచ్చని మరికొంద రంటున్నారు. దీంతో జనగణన, డీలిమిటేషన్‌పై మీమాంస మొదలైంది. ఈ నేపథ్యంలో.. అసలు జనగణన అంటే ఏమిటి? ఎలా చేపడుతారు? జనగణనకు, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తవ్వడానికి ఎంత సమయం పట్టొచ్చు? అనే చర్చ జరుగుతున్నది.**చరిత్రలో మొదటిసారి వాయిదా:** 1872లో బ్రిటిష్ పాలనలో దేశంలో జనగణన ప్రక్రియ మొదలైంది. ఇంతవరకూ ఈ ప్రక్రియ ఎన్నడూ వాయిదా పడలేదు. 1941లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలోనూ దీన్ని నిర్వహించారు. అయితే, చరిత్రలో తొలిసారిగా కరోనా కారణంగా జనగణన ప్రక్రియను కేంద్రం 2021లో వాయిదా వేసింది. ఇదే కరోనా సంక్షోభ సమయం లోనే పొరుగున ఉన్న బంగ్లాదేశ్, నేపాల్ సహా ప్రపంచంలోని 143 దేశాలూ జనగణన ప్రక్రియ చేపట్టాయి. భారత్‌లో మాత్రం అలా జరుగలేదు. దీంతో అప్పట్లోనే మోదీ సర్కారుపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇక, కరోనా తగ్గి మూడేట్కండ్లైనా కేంద్రప్రభుత్వం జనగణన ఊసే ఎత్తలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహిస్తారనుకొన్న జన గణనను సార్వత్రిక ఎన్నికల పేరిట కేంద్రం మరోమారు వాయిదా వేసింది.బడ్జెట్‌లో కోతతో మళ్లీ వాయిదా: నిజానికి ఈ ఆర్థిక సంవత్సరం జనగణన ఉంటుందేమోనని అందరూ భావించారు. అయితే, కేంద్రం ఈ ఏడాది బడ్జెట్‌లో జనగణనకు రూ. 1,309.46 కోట్లను మాత్రమే కేటాయించింది. నిజానికి దేశవ్యాప్తంగా ఇప్పటికిప్పుడు జనగణన చేపట్టాలంటే దాదాపు రూ.12 వేల నుంచి రూ. 15 వేల కోట్ల వరకూ నిధులు అవసరమవుతాయని నిపుణుల అంచనా. బడ్జెట్‌లో కేటాయించిన అరకొర నిధుల దృష్ట్యా ఈ ఆర్థిక సంవత్సరం జనగణన ఉండదని సుస్పష్టమైంది. దీంతో 2025-26 ఆర్థిక సంవతర్సరంలో జనగణన ఉండొచ్చేమోనని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు.**జనగణన ప్రక్రియ ఇలా..:** జనగణనను రెండు దఫాల్లో నిర్వహిస్తారు. మొదటిది హౌస్ లిస్టింగ్ (ఇంటింటి సర్వే). రెండోది జనాభా గణన. ఇంటింటి సర్వేలో ఇంటి నంబర్, ఇల్లు రకం, యజమాని పేరు, వివరాలు, యజమాని కులం, జననాలు, మరణాలు, లింగం, వృత్తి, ఆదాయం, వలసలు.. ఇలా 35 అంశాలకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. రెండో దశలో 30 అంశాల్లో ఒక్కో వ్యక్తి వ్యక్తిగత వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి ప్రత్యేకంగా రికార్డు చేస్తారు. 2011 జనగణన మొత్తం ప్రక్రియ పూర్తవ్వడానికి 11 నెలల సమయం పట్టింది. హౌస్‌లిస్టింగ్‌కు 8 నెలల సమయం కాగా, రెండో దఫా పూర్తవ్వడానికి మూడు నెలల సమయం పట్టింది. అలా ఏప్రిల్ 1, 2010లో ప్రారంభమైన జనగణన ప్రక్రియ మార్చి 31, 2011న పూర్తయింది. అయితే, ఇప్పుడు చేపట్టబోయే జనగణనను మొబైల్ అప్లికేషన్ల సాయంతో పూర్తిగా డిజిటైజేషన్ పద్ధతిలో చేపడుతామని హోంమంత్రి అమిత్‌షా చెప్పున్నారు. దీంతో జనగణన ప్రక్రియ పూర్తిచేయడానికి గతంతో పోలిస్తే ఈసారి తక్కువ సమయమే పట్టొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2011లో జనగణన చేపట్టే సమయంలో ఆధార్ కార్డుల వివరాలు లేవు. నేషనల్ పాపులేషన్ రిజిష్టర్ (ఎన్పీఆర్) డేటా అందుబాటులో లేదు. అయితే, ఇప్పుడు ఆ సమాచారం ప్రభుత్వం దగ్గర ఉన్నది. దీంతో తక్కువసమయంలోనే జనగణన పూర్తవ్వవచ్చని చెప్తున్నారు. అయితే, జనగణన ఎప్పుడుమొదలుపెడుతారన్న విషయమే తేలాల్సి ఉన్నది.**బౌండరీస్ డెడ్‌లైన్ మళ్లీ వాయిదా?:** జనగణన ప్రక్రియ మొదలవ్వడానిక ంటే ముందు జిల్లాలు, తహసిల్‌లు, పట్టణాలు, మునిసిపాలిటీల పరిధులను మార్చకుండా ఉండేలా కేంద్ర ప్రభుత్వం జనగణన నిబంధనలు, 1990 రూల్ 8(4) ప్రకారం.. ఫ్రీజ్ అడ్మినిస్ట్రేటివ్ బౌండరీస్ పేరిట ఓ డెడ్‌లైన్‌ను విధిస్తుంది. ఈ డెడ్‌లైన్ ముగిసిన మూడు నెలల్లోపు సిబ్బందికి ట్రైనింగ్‌ను పూర్తిచేసి సాధారణంగా జనగణన ప్రక్రియను మొదలుపెడతారు. డిసెంబర్ 2020 నుంచి ఇప్పటికే 9 సార్లు ఈ డెడ్‌లైన్‌ను పొడిగించిన కేంద్రం.. చివరగా జూన్ 30, 2024ను డెడ్‌లైన్‌గా నిర్ణయించింది. అంటే, ఒకవేళ మరో పొడిగింపు ఉండకపోతే, వచ్చే అక్టోబర్‌లో జనగణన ప్రక్రియ ప్రారంభం కావచ్చు. అయితే, జనగణనకు అవసరమైన నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయించకపోవడంతో.. ఈ ఆర్థిక సంవత్సరం జనగణన ఉండకపోవచ్చుననే అభిప్రాయం కలుగుతున్నది. దీంతో ఫ్రీజ్ అడ్మినిస్ట్రేటివ్ బౌండరీస్ డెడ్‌లైన్‌ను కేంద్రం మరోసారి పొడిగించవచ్చని నిపుణులు చెప్తున్నారు.**జనగణనకు కేంద్రం విముఖం?!:** జనగణన చేపట్టడానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు సుముఖంగా లేనట్టు మరికొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జనగణనతో పాటు కులగణన కూడా జరపాలని డిమాండ్ ఉంది. ఇప్పటికే అనేక రాష్ట్రాలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటొద్దని ఒకవైపు సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. కులం అనే అంశం దేశంలో బలంగా వేళ్లూనుకొన్నది. అయితే, మతం ఆధారంగా రాజకీయాలు చేస్తున్న బీజేపీ.. ఇప్పటికిప్పుడు కులగణన చేపడితే, తమ ఓటుబ్యాంకు విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉన్నదని భావిస్తున్నదని కొందరు అంటున్నారు. అందుకే కులగణన భయంతో జనగణనను కేంద్రం ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తున్నదని చెప్తున్నారు.

# నది దిశ మార్చుకోవడంతోనే.. వయనాడ్‌లో అధిక నష్టం!



వయనాడ్: వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ ఘటనకు సంబంధించి నేషనల్ సెంటర్‌ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్ విశ్రాంత శాస్త్రవేత్త సోమన్ కీలక విషయాలు. ఈ విపత్తులో ఎక్కువగా నష్టం జరిగిన ముండక్కై, చూరల్‌మల ప్రాంతాలు నది ఒడ్డున ఉన్నాయని చెప్పారు. గతంలో ఇక్కడ కొండచరియలు విరిగి నదిలో పడి ఉండకుండా, అలా నదీ ప్రవాహం దిశ మారగా ఏర్పడిన ప్రాంతంపైనే ఇప్పుడు ఇండ్లు, దుకాణాలు వెలిశాయని ఆయన అభిప్రాయపడ్డారు. నీటికి గత ప్రవాహం గుర్తుందని, ఇప్పుడు నది గతంలో ప్రవహించిన దిశను మళ్లీ తీసుకోవడంతోనే అన్నీ కొట్టుకుపోయి ఉండొచ్చని అన్నారు. కొండచరియలు విరిగిపడటం ప్రారంభమైన వెల్లరిమల సముద్రమట్టానికి 2వేల అడుగుల ఎత్తులో ఉంది, ముండక్కై, చూరల్‌మల మాత్రం 900 – 1000 అడుగుల ఎత్తులో ఉన్నాయి, కాబట్టి రాళ్లు చాలా బలంగా కిందకు దూసుకొచ్చాయి.

334కు పెరిగిన మృతుల సంఖ్య

వయనాడ్ విపత్తులో ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 334కు పెరిగింది. ఇంకా 281 మంది ఆచూకీ దొరికారు. శిథిలాల కింద ఉన్నవారిని గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. డ్రోన్‌లు, థర్మల్ స్కానర్‌ల ద్వారా గాలిస్తున్నారు. ముండక్కైలో కొట్టుకుపోయిన ఓ దుకాణం దగ్గర శిథిలాల కింద జీవం ఉండొచ్చని థర్మల్ స్కానర్ అప్రమత్తం చేసింది. అయితే, 3 మీటర్ల లోతులో, ఐదు గంటల పాటు వెతికినా మనిషి ఆనవాళ్లు దొరికాడు. మరోవైపు, పశ్చిమ కనుమల 56,800 చతురస్రాకారంలో పర్యావరణ పరంగా చాలా సున్నితమైనదని నిదర్శనం కేంద్రం ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. వయనాడ్‌లో కొండచరియల విధ్వంసానికి గురైన 13 గ్రామాలు కూడా దీని పరిధిలో ఉన్నాయి.

# ఏటా లంక గ్రామాల్లో ప్రజల విలవిల



రాజమహేంద్రవరం, ఏటా గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో లంకగ్రామాలు విలవిల్లాడు తున్నాయి. గతేడాది ఇలాంటి ఉపద్రవమే వచ్చినా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదు. నాలుగైదు రోజులుగా కోనసీమ జిల్లాలోని లంకలు వరద నీటిలో నానుతున్నాయి. ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజీ నుంచి నీరు దిగువకు వదలడంతో వైనతేయ, వశిష్ట, వృద్ధ గౌతమి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుంటాయి. కోనసీమ జిల్లాలో తొమ్మిది మండల్లాలోని 30 గ్రామాలపై వరద ప్రభావం తీవ్రంగా పడుతోంది. ఆయా లంక గ్రామాల్లో నివసించే వేలాది కుటుంబాలు ప్రతియేటా వరదల సమయంలో తీవ్రంగా నష్టపోతున్నారు. వరదల్లో ప్రాణాలు కోల్పోవడమే గాకుండా, సర్వం కోల్పోయి, కట్టుబట్లతో బయటపడుతున్నారు. ఇలాంటి వారికి ఏటా కలుగుతున్న సమస్యలపై ప్రభుత్వం ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోవడం లేదు. వరద బారిన పడ్డవారు జీవనం కోసం పట్టణ కేంద్రాల్లో కూలి పనులు, వివిధ వృత్తులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. చాలామంది గ్రామాల నుంచి బయటకు వెళ్లే పరిస్థితులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెనలు నిర్మించడం ద్వారా కొంత ఊరట లభించే అవకాశాలు ఉన్నా... దశాబ్దాల కాలంగా వీటి నిర్మాణ హామీ కాగితాలకే పరిమితమైంది. దీంతో, ఏటా ముంపు తప్పటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.గన్నవరం మండలంలో బూరుగులంక, అరిగెలవారి పాలెం, గంటి పెదపూడి లంక, కనకాయలంక, జొన్నలంక, కె.ఏనుగుపల్లి, ఏనుగుపల్లి లంక, కండాలపాలెం, నాగుల్లంక, శివాయలంక, కాట్రగడ్డ, కె.ముంజవరం గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. మామిడికుదురు మండలం అప్పనపల్లి, పెదపట్నం, పెదపట్నం లంక, దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడి బాడవ గ్రామాలు, అప్పనపల్లి కాజ్‌వేపైకి వరద పోటెత్తినప్పుడు వీరి బతుకులు ఛిద్రం అవుతున్నాయి. వాకలగరువులో కరకట్ట దిగువన ఫిషర్మెన్ పేటలో సుమారు వంద కుటుంబాలకుపైగా జీవిస్తున్నారు. ఏటా వరదల సమయంలో ఒడ్డు కోతకు పలు ఇళ్లునదీ గర్భంలో కలిసిపోతున్నాయి. మూడు లంక గ్రామాలకు ఆర్ అండ్ బి రహదారిలో పాశర్లపూడిలో కరకట్ట దిగువ కాజ్‌వే ఎత్తు చేస్తే వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం ఉండదని అంటున్నారు. 600 మీటర్ల మేర కాజ్‌వే వద్ద ఐదడుగుల ఎత్తులో బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి వరద నీరు వస్తే లంక గ్రామాలు ముంపునకు గురవు తున్నాయి. రాకపోకలు నిలిచిపోతుండడంతో ఉపాధికి దూరమవుతున్నారు. ఏటా ఇదే పరిస్థితి. వరద ఉంటే ఆ రోజు పస్తులే అన్నట్టుగా వారి పరిస్థితి తయారైంది. కరకట్ట ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడిన సమయంలో మురుగు నీటిని నదిలో మళ్లించేందుకు బ్రిటిష్ వారి హయాంలో అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు నిర్మించారు. నేటికీ వీటినే వాడుతున్నారు. ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వరదల సమయంలో లీకుల ద్వారా వరద పోటెత్తి పంటలకు నష్టం వాటిల్లుతోంది.కాలనీలను ముంచెత్తుతోంది. ఈ దృష్ట్యా స్లూయిజ్‌లను పటిష్ట పర్చాల్సి ఉంది. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం నుండి ఎటువంటి సాయమూ అందక ఆయా లంక గ్రామాల ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. మండలంలోని కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, దొడ్డిపట్ల గ్రామాల వరద బాధితుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గతంలో వరదల సమయంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు, తాగునీరు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదని బాధితులు వాపోతున్నారు. పునరావాస కేంద్రాలకు వస్తేనే భోజనాలు ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. లంక గ్రామాల ప్రజలు మాత్రం తమ ఇళ్లను, పశువులు, మేకలు, కోళ్లను వదిలి ఎక్కడో దూరప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లడానికి నిరాకరిస్తున్నారు. దీంతో, వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చిన్నపిల్లలు, వృద్ధులు, బాలింతలకు అధికారులు కనీసం తాగునీరు, పాలు వంటి వాటిని కూడా అందించలేదు. పడవల్లో బయటకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకొనే పరిస్థితి లేక పేదలు ఆకలితో అలమటిస్తున్నారు. గత పది రోజులుగా ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమను భోజనాలు, తాగునీరు వంటివి అందించి ఆదుకో వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. పీకల్లోతు మునిగిపోయినా ఇప్పటి వరకు మమ్మల్ని పట్టించుకున్న నాథుడే లేడు. వరద బాధితుల గోడు ప్రభుత్వానికి పట్టకపోవడం చాలా బాధ కలిగిస్తోంది.

# పోలవరం పూర్తయితే మారనున్న రూపురేఖలు

విజయవాడ, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి అటు బడ్జెట్‌లో కేంద్రం హామీ ఇవ్వడం.. ఇటు తొలి దశ నిర్మాణానికి 12 వేల కోట్ల పెండింగ్ నిధులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఏపీ ప్రభుత్వం కూడా పోలవరం నిర్మాణంపై మరింత ఫోకస్ పెంచింది. వీలైనంత త్వరగా ప్రాజెక్టును పూర్తి చేసే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. ఇప్పటికే అంతర్జాతీయ నిపుణుల బృందం పర్యటించి పోలవరంపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి నివేదిక తయారు చేసింది. ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రధానంగా ఉన్న అడ్డంకులేంటి..? ప్రస్తుతం ఏ మేరకు పనులు పూర్తయ్యాయి..? ఇక చేయాల్సిందేంటి..? దీనిపై చంద్రబాబు ప్రభుత్వానికి కూడా క్లారిటీ వచ్చింది. దీంతో పనుల్లో వేగం పెంచి.. వీలైనంత త్వరగా ప్రాజెక్ట్ కంప్లీట్ చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది ఏపీ ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుపై మళ్లీ దృష్టి పెట్టారు. గత ఐదేళ్లుగా ప్రాజెక్టుకు ఏర్పడ్డ అవాంతరాలను తొలగించుకుంటూ నిర్మాణాన్ని వేగం పెంచే ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి కేంద్రం నుంచి కూడా సానుకూల వాతావరణం కనిపిస్తుండటంతో ప్రాజెక్ట్ పనులు స్పీడందుకోనున్నాయి. ఇప్పటికే సీఎం చంద్రబాబు పోలవరంలో పర్యటించి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఆపై అసెంబ్లీ సాక్షిగా పోలవరం ప్రాజెక్ట్‌పై శ్వేతపత్రం విడుదల చేశారు. పోలవరం డ్యామ్ సైట్ ను పరిశీలించేందుకు అంతర్జాతీయ నిపుణుల బృందాన్ని పిలిచింది ప్రభుత్వం. అమెరికా నుంచి జియాన్ ఫ్రాంకో డి సిక్కో, డేవిడ్ బి.పాల్, కెనడా నుంచి సీన్ హించ్‌బర్గర్, రిచర్డ్ డోన్నెల్లీ ఈ ప్రాజెక్ట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నలుగురూ సాగునీటి ప్రాజెక్ట్ నిర్మాణరంగ నిపుణులు.పోలవరం డిజైన్, ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్, ఇతర నీటిపారుదల అధికారులు, సెంట్రల్ వాటర్ కమిషన్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ సాయిల్ రీసెర్చ్ స్టేషన్, ఇంకొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులతో చర్చించారు. ప్రాజెక్టు డిజైన్‌కి సంబంధించిన వివరాలు, ఇతర డాక్యుమెంట్లు అన్నీ ఈ ఎక్స్‌పర్ట్స్ టీమ్ పరిశీలించింది. జెట్ గ్రౌంటింగ్, సీపేజ్‌లపై రిపోర్ట్‌ను కూడా ప్రత్యేకంగా తయారు చేసింది. అలాగే డయాఫ్రమ్ వాల్ లాంటివి నిర్మించిన చోట నీటి ఒత్తిడి లెక్కగట్టింది. ప్రాజెక్ట్ నిర్మించిన కంపెనీలతో మాట్లాడి గ్రౌండ్ రియాలిటీ ఏంటో అర్థం చేసుకుని.. ఎక్కడ తప్పులు జరిగాయి. వాటిని ఎలా రెక్టిఫై చేయాలనేదానిపై సమగ్ర నివేదిక తయారు చేశారు. దాన్ని ఏపీ ప్రభుత్వానికి అందించారు.ప్రస్తుతం పోలవరం నిర్మాణానికి సంబంధించి టెక్నికల్ ప్రాబ్లమ్స్ చాలానే ఉన్నాయి. అప్పర్ కాపర్ డ్యామ్‌లో సీపేజీ వస్తోంది. ఇది నిర్మాణ పనులకు అవాంతరంగా మారుతోంది. సీపేజీ వ్యవహారం పోలవరం భవితవ్యానికి సవాల్‌గా ఉండబోతోంది. మెయిన్ డ్యామ్‌లో భాగంగా నిర్మించిన డయాఫ్రమ్ వాల్ మూడేళ్ల క్రితం వచ్చిన భారీ వరదల్లో కొట్టుకుపోయింది. డయాఫ్రమ్ వాల్ స్థానంలో రింగ్ ఫెన్సింగ్ చేస్తే సరిపోతుందని మొదట కమిటీ నివేదిక ఇచ్చింది. దీనికి సమాంతరంగా మరో డయాఫ్రమ్ వాల్ నిర్మించడం ఉత్తమమని కూడా మరో నివేదిక ఇచ్చింది. ఏం చేస్తే ప్రాజెక్ట్ శాశ్వతంగా , డ్యామేజ్‌కు ఆస్కారం కాకుండా ఉంటుందనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. 1941 నుంచే పోలవరం ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన ఉంది. కొన్ని దశాబ్దాలు ఆ కల కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత 2004లో ప్రాజెక్ట్ మొదలైంది. రెండు దశాబ్దాలు గడిచాయి. ఇంకా ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటూ ఉంది. 2014 రాష్ట్ర విభజన తర్వాత పోలవరం ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ అనుమతులతో పాటు ముంపు ప్రాంతాలు పెద్ద అడ్డంకిగా మారాయి. తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేయడంతో దానికి పరిష్కారం దొరికింది. కానీ.. భూసేకరణ , పునరావాసం, బాధితులకు నష్టపరిహారం రూపంలో అంచనా వ్యయం అమాంతం రెట్టింపు అయిపోయింది. ఇప్పటికి 72 శాతం ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు. వరదల కారణంగా డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. దీనికి మరమ్మతులు చేయాలంటే 436 కోట్లు



ఖర్చవుతుంది. కొత్త డయాఫ్రమ్ వాల్ కట్టాలంటే దాదాపు వెయ్యి కోట్లు అదనపు ఖర్చు. ఏ విధంగా చూసినా దెబ్బతిన్న డయాఫ్రం వాల్ నిర్మాణానికి ఇప్పుడు మళ్లీ ఖర్చు చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. అంతే కాదు రెండు నుంచి నాలుగు సీజన్ల సమయం కూడా వృధా అవుతుంది. దీనికి తోడు 2019 తర్వాత కాంట్రాక్టర్లను మార్చడంతో హెడ్ వర్క్స్ నిలిచిపోయాయి. అప్పర్, లోయర్ కాఫర్ డ్యాంలు దెబ్బతిన్నాయి. గైడ్ బండ్ దెబ్బతినడంతో విద్యుత్ ప్రాజెక్ట్ నిర్మాణం కూడా ఆగిపోయింది. అటు ఏళ్లు గడవటం, ఇటు అంచనా వ్యయం పెరగడం, వరదలు ఇతర కారణాల వల్ల ప్రాజెక్ట్ కొంత దెబ్బతినడంతో ఇప్పుడు మళ్లీ మరమ్మతులు సహా కొత్త పనులను కూడా ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడింది. 2014–2019 మధ్య దాదాపు 11 వేల 5వందల కోట్లు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఖర్చు చేశారు. 24 గంటల్లో 32 వేల 315 క్యూబిక్ మీటర్లు కాంక్రీట్ పనులు చేసి గిన్నిస్ బుక్ రికార్డుకెక్కిన ఘనత కూడా ఆ ప్రాజెక్టుకు ఉంది.పోలవరంలో డయాఫ్రం వాల్ డెప్త్ 90 మీటర్లు. 20 మీటర్ల ఎత్తు, 16 మీటర్ల వెడల్పుతో అతి భారీ గేట్లు ఉంటాయి. 390 కిలోమీటర్ల పొడవైన కుడి, ఎడమ కాల్వలతో నిర్మాణపరంగా ఈ ప్రాజెక్ట్ అతి పెద్దది. ప్రాజెక్ట్ పూర్తయితే దాదాపు 7లక్షల 20వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 28 లక్షల 50 వేల మందికి తాగునీటి అవసరాలు తీరుతాయి. అంతేకాదు, పోలవరం ద్వారా 960 మెగావాట్ల విద్యుత్ ను ఉత్పత్తి చేయొచ్చు. వాటర్ టూరిజం కూడా సాధ్యపడుతుంది. పరిశ్రమలకు నీటి కొరత అనే సమస్యే ఉండదు. వరదల కారణంగా ఏటా ఏపీకి ఎంతో నష్టం కలుగుతోంది. ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తే ఆ కష్టాలు కూడా తొలగిపోతాయి. ఈ ప్రాజెక్టు సాయంతో 50 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని పక్కకు మళ్లించవచ్చు.పోలవరం పూర్తయితే లెఫ్ట్ కెనాల్, రైట్ కెనాల్ ద్వారా దాదాపు ఏపీ మొత్తానికి సాగునీరు, తాగునీటి అవసరాలు తీరుతాయి. అటు ఉత్తరాంధ్రలోని విశాఖ , ఉభయగోదావరి, కృష్ణా, ఇటు రాయలసీమకు కూడా నీటిని అందించే అవకాశముంటుంది. ఇలా వరదల సమయంలో సముద్రంపాలయ్యే 3 వేల టీఎంసీల నీటిని ఒడిసిపడితే రాష్ట్రం కరువురహితంగా మారి.. సస్యశ్యామలమవుతుంది. ఇది ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం.పోలవరం ప్రాజెక్టు ఎప్పుడో పూర్తి కావాల్సి ఉన్నా.. కేంద్రం సాయం చేయకపోవడం, ప్రభుత్వాలు మారటం, ప్రాధాన్యాలు తగ్గడంతో ఇన్నాళ్లూ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ వచ్చింది. ఇప్పుడు ఏపీతో పాటు కేంద్రంలో కూడా ఎన్డీయే కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంది. అనుమతులు, నిధులు రాబట్టడంలో పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదు. దీనికి తోడు కేంద్రం కూడా పోలవరం పూర్తి చేసే బాధ్యత తమదేనని ప్రకటించడంతో రాష్ట్ర సర్కార్ ప్రాజెక్ట్ పనుల్ని మరింత వేగం చేయాలనుకుంటోంది. ఇప్పటివరకు జరిగిన నష్టాన్ని అధిగమిస్తూ.. అంతర్జాతీయ నిపుణులు, దేశీయ ఐఐటీ నిపుణులు, సీడబ్ల్యూసీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో సవాళ్లను అధిగమించనుంది. వీలైనంత త్వరగా పోలవరం పూర్తి చేయాలని గట్టి పట్టుదలతో ఉంది ఏపీ సర్కార్.

# ప్రపంచంతో పోటీపడేలా హైదరాబాద్ అభివృద్ధి



హైదరాబాద్ : హైదరాబాద్ నగర శాంతి భద్రతల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఇక నుంచి హోటళ్లు, రెస్టారెంట్లు అర్ధరాత్రి ఒంటి గంట వరకు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. వర్షం వస్తే చుక్కనీరు రోడ్లపై నిల్వ ఉండకుండా ఉండేందుకు చర్యలు ప్రారంభించామని, వాటర్ హార్వెస్టింగ్ గుంతలు నిర్మిస్తున్నామని ఆయన వివరించారు. అత్యధిక వర్షాలు పడినపుడు రోడ్లపై నీళ్లు నిలవకుండా హార్వెస్టింగ్ వెల్ డిజైన్ చేయాలని అధికారులకు సూచించామని, 141 ప్రాంతాలను గుర్తించి డిజాస్టర్ మేనేజ్ మెంట్ సిబ్బందిని అప్రమత్తం చేసేలా చర్యలు చేపట్టామన్నారు. వర్షాలు పడినపుడు ఫిజికల్ పోలీసింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో నగర అభివృద్ధిపై విపక్ష, స్వపక్ష సభ్యులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు రేవంత్ రెడ్డి సమాధానమిచ్చారు. ప్రపంచంతో హైదరాబాద్ మహానగరం పోటీపడే విధంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఉస్మానియా ఆసుపత్రికి కొత్త భవనం నిర్మిస్తామని తెలిపారు. వరల్డ్ సిటీగా రూపొందించేందుకు హైదరాబాద్ మెగా మాస్టర్ ప్లాన్ –2050తో ముందుకు వెళ్తామన్నారు. పాతబస్తీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ప్రపంచ దేశాలను స్టడీ చేసి రెండువేల చదరపు కిలోమీటర్ల పరిధిలో హైడ్రాను రూపొందించామన్నారు. నాలాలను కబ్జా చేయాలంటే వణుకు పుట్టాలన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ పనికిరాదు

గతంలో గంటకు 2సెం.మీ వర్షాన్ని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ లో డ్రైనేజ్ వ్యవస్థ డిజైన్ చేశారని, వాతావరణ మార్పులతో కుంభవృష్టి కురిస్తే వరదలు వస్తున్నాయని, సమస్యల శాశ్వత పరిష్కారానికి హైడ్రాను ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. నాలాలు ఆక్రమణ చేయాలంటేనే గుండెల్లో గుబులు పుట్టాలని, అలాంటి వ్యవస్థను తీసుకు వస్తామన్నారు. హైదరాబాద్ నగర ప్రజల ఇబ్బందులు తొలగించాలని ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరానికి కాంగ్రెస్ ప్రభుత్వం 1965లో మంజీరా జలాలు, 1982 సింగూరు జలాలు, 2004 లో కృష్ణా ఫేజ్–1, 2008 కృష్ణా ఫేజ్–2 ద్వారా తాగు నీరు అందించిందని రేవంత్ వివరించారు. 2014లో కృష్ణా ఫేజ్–3 90శాతం పనులు కాంగ్రెస్ పూర్తి చేసిందన్నారు. కానీ 2015 లో తామే తెచ్చినట్లు టీఆర్ఎస్ నేతలు గొప్పలు చెప్పుకున్నారని ఎత్తిపొడిచారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలున్నా ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, వైఎస్ఆర్ నగరం అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని రేవంత్‌రెడ్డి ప్రశంసించారు.

గతంలో పాన్ డబ్బాలో గంజాయి దొరికేది..

హత్యలు, లైంగిక దాడులు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేతలు నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కాలనీలో గంజాయి మత్తులో ఆడబిడ్డను రేప్ చేస్తే కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించలేదని మండిపడ్డారు. దిశ అత్యాచార ఘటనలో ఆ కుటుంబాన్ని కనీసం పరామర్శించ లేదన్నారు. మొయినాబాద్ దగ్గర బీఆర్ఎస్ నాయకుడు రేప్, మర్డర్ చేస్తే చర్యలు శూన్యమన్నారు. వాళ్ల హయాంలో ఇంత జరిగితే అబద్ధాల ప్రాతిపదికన తమపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో పాన్ డబ్బాలో గంజాయి దొరికే పరిస్థితి.. ఇవాళ గంజాయి అమ్మాలంటే భయపడే పరిస్థితి తీసుకొచ్చామన్నారు.

హైడ్రాతో ఎంతో మేలు

గొప్ప ఆలోచనతో సమాజానికి విస్తృత సేవలు అందించేందుకు హైడ్రాను తీసుకోచ్చామని, నగరానికి అద్భుతమైన బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేసే ప్రయత్నం చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. 55 కి.మీ మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు చేపట్టనున్నామని తెలిపారు. 'రూ.లక్ష 50వేల కోట్లకు అంచనాలు పెంచారని కేటీఆర్ అంటుండు.. మీ హయాంలో కాళేశ్వరం కడితిరి.. కూలిపోయింది కదా' అన్నారు. తాము పని మొదలు పెట్టకముందే డీపీఆర్ అడుగుతున్నారన్న రేవంత్‌రెడ్డి.. కాంట్రాక్టర్లతో మాట్లాడుకుని కమీషన్లు దండుకునేందుకా? అని ప్రశ్నించారు. నగరంలో చెరువులు, కుంటలను కబ్జా చేస్తుంటే ఏం చేస్తున్నారంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అప్రమత్తమయ్యామన్నారు. అద్దాల మేడలు, రంగులగోడలను చూపించి ఇదే అభివృద్ధి అని గత పదేళ్లలో ప్రచారం చేసుకున్న పెద్దలు ఈ సభలోనే ఉన్నారు. చారిత్రక కట్టడాలతో హైదరాబాద్ అద్భుత నగరంగా విలసిల్లింది. రాబోయే వందేళ్ల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని హైడ్రాను ఏర్పాటు చేస్తున్నాం. ఆక్రమణలను నియంత్రించే బాధ్యత కూడా హైడ్రా తీసుకోనుందని రేవంత్ రెడ్డి వివరించారు.

# 2027 నాటికి విద్యుత్తు కోతల మోత!



న్యూఢిల్లీ, : భారత్‌లో విద్యుత్తు వినిమయ అవసరాలు నానాటికీ పెరుగుతున్నాయి. దీంతో 2023లో మన దేశ విద్యుత్తు డిమాండ్ 7% పెరిగింది. ఇది ప్రపంచ సగటు (2.2%) కంటే చాలా ఎక్కువ. ఈ నేపథ్యంలో 2027 నాటికి భారత్‌లో సాయంత్రం వేళల్లో విద్యుత్తు కోతలు మరింత పెరగడం ఖాయమని ఓ అధ్యయనం వెల్లడించింది. పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా తగినంత విద్యుత్తును ఉత్పత్తి చేసుకోకపోవడమే ఇందుకు కారణమని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా (బర్కిలీ) ఆధ్వర్యంలోని ఇండియా ఎనర్జీ అండ్ టక్లైమేట్ సెంటర్ తన అధ్యయన నివేదికలో స్పష్టం చేసింది. 2027 నాటికి భారత్‌లో ఉన్న అన్ని కోల్ ప్లాంట్లు, థర్మల్ విద్యుత్తు వ్యవస్థలు పూర్తిస్థాయిలో పనిచేసినప్పటికీ ఈ పరిస్థితి తప్పదని పేర్కొన్నది. ప్రస్తుతం మన దేశం 446 గిగావాట్ల స్థాపిత విద్యుత్తు సామర్థ్యాన్ని కలిగి ఉన్నది. దీనిలో బొగ్గు ద్వారా 211 గిగావాట్లు, పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా 195 గిగావాట్ల విద్యుత్తు వస్తుండగా.. మిగిలినదంతా గ్యాస్, అణుశక్తి ద్వారా ఉత్పత్తి అవుతున్నది. కానీ, ఇంత సామర్థ్యం అన్ని సమయాల్లో అందుబాటులో ఉండదు. దీంతో పగలంతా ఉండే హీట్‌వేవ్ ప్రభావం రాత్రి కూడా కొనసాగితే ఏసీల వినియోగం వల్ల విద్యుత్తు డిమాండ్ మరింత అధికమవుతుంది. ఈ సమస్యను పరిష్కరించుకోవాలంటే భారత్ మరిన్ని సోలార్ పవర్ ప్లాంట్ల ను ఏర్పాటు చేసుకోవడంతోపాటు వాటి ద్వారా ఉత్పత్తయ్యే సౌరవిద్యుత్తును బ్యాటరీల్లో నిల్వచేసుకోగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని పరిశోధకులు స్పష్టం చేశారు.

# ఇక ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కష్టాలకు చెక్

హైదరాబాద్ : ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిలో మూసీ నది బ్రిడ్జి టేకు మట్ల గ్రామం దాటిన తర్వాత ఖమ్మం కు కొత్త రోడ్డు నిర్మాణం జరిగిన విషయం తెలిసిందే. అయితే, ఖమ్మంనుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలు సూర్యాపేట వైపు రాయినిగూడ గ్రామ సమీపానికి సుమారు 2కిలోమీట ర్స్ వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తు న్నది. ఇది వాహనదారులకు ఇబ్బందిగా మారింది. పలు ప్ర మాదాలు కూడా చోటు చేసుకు న్నాయి.ఇక్కడ నెలకొన్న ప్రమాద కర పరిస్థితి గురించి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు స్వయంగా కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. ఎంపీ రవిచంద్ర విజ్ఞప్తులను పరిశీలించి గడ్కరీ సానుకూ లంగా స్పందిస్తూ ఫ్లైఓవర్ మం జూరు చేశారు. దీని నిర్మాణపు పనులను నేషనల్ హైవేస్ అథారిటీ త్వరలో చేపట్టనుంది. తన విజ్ఞప్తి మేరకు ప్రయాణికుల కష్టాలను కడతేర్చేందుకు ఫ్లైఓవర్ మంజూరు



చేయడం పట్ల ఎంపీ వద్దిరాజు హర్షం వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com